సాక్షి 24|7

కృష్ణా జిల్లా

ఆదివారం 7-1-2018



'క్యాట్' వాక్

■ విజయవాడలోని పీవీపీ మాల్‌లో శనివారం నిర్వహించిన క్యాట్ ఫ్యాషన్ షో ఆద్యంతం సందడిగా సాగింది. వివిధ జాతుల పిల్లులు ఈ షోలో పాల్గొని సందడి చేశాయి. సరికొత్త ఫ్యాషన్ డ్రస్సులు మ్యాచింగ్ జ్యూయలరీతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

8లో

■ ఐరన్ కాస్టింగ్ కంపెనీలో ప్రమాదం జరిగిన ప్రాంతం ఇదే..



కాల్చేసిన ఉపద్రవం

పొట్టకూటి కోసం రాష్ట్రాల సరిహద్దులు దాటివచ్చిన బడుగుల బతుకులు బుగ్గయ్యాయి. కండలు కరిగించి చెమట చిందించే శరీరాలు.. మరిగిన లోహం ధాటికి పీలికలయ్యాయి. మూడుపూటలా నాలుగు మెతుకులు పెట్టే కార్ఖానాలోనే నూరేళ్ల జీవితాలు తెల్లారిపోయాయి. గన్నవరం మండలం సూరంపల్లి సమీపంలోని ఐరన్ కాస్టింగ్ కంపెనీలో శనివారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు కార్మికులు కట్టెలుగా మారగా, మరో ఆరుగురు కాలిన గాయాలతో ఆస్పత్రిలో విషమ పరిస్థితిలో ఉన్నారు.

2లో

సూరంపల్లి ఐరన్ కాస్టింగ్ కంపెనీలో ఘోర ప్రమాదం

- ముగ్గురు మృతి, ఆరుగురి పరిస్థితి విషమం
- ఐరన్ స్కాబ్ కరగబెడుతుండగా పేలుడు
- మరుగుతున్న ద్రవం పడి మరణం



దుర్గగుడి ఈవోపై వేటు

దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధకు బాధ్యతలు

మెయిన్‌లో..

మారథాన్‌కు అంతా రెడీ

నేటి ఉదయం 6 గంటలకు ఐజీఎంసీ స్టేడియం నుంచి ప్రారంభం

2లో


ఘటనాస్థలం వద్ద అగ్నిమాపక వాహనాలు


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ విజయకృష్ణన్ తదితరులు


ఫ్యాక్టరీ వద్ద పోలీసులు, ఇతర అధికారులు

కాల్చేసిన ఉపద్రవం

అందరి పరిస్థితి విషమమే..

- గొల్లపూడి ఆంధ్రా ఆస్పత్రికి బాధితులు
- ప్రాణాపాయంలో ఆరుగురు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): గన్నవరం మండలం సూరంపల్లిలోని జీఎస్ ఎల్లాయ్ కాస్టింగ్ కంపెనీలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన ఎనిమిది మందిని గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పటల్‌కు తరలించారు. వారిలో ఇద్దరు మృతిచెందగా, మిగిలిన ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 70 నుంచి 90 శాతం మేర కాలిన గాయాలతో ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతూ చికిత్స పొందుతున్నారు.

ఆంధ్రా హాస్పటల్‌కు వచ్చిన వారువీరే..

సూరంపల్లిలోని జీఎస్ ఎల్లాయ్ కాస్టింగ్ కంపెనీ ప్రమాదంలో గాయాలైన వారిలో ఒడిశాకు చెందిన సత్యనారాయణ (35), గుంటూరు జిల్లాకు చెందిన అహ్మద్ ముజాహుద్దీన్ (26), చెన్నుపోహారుకు చెందిన పి.శివశంకర్‌కుమార్ (35), బీహార్‌కు చెందిన ఉమాశంకర్ సారథి (31), తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన వి.బాబాప్రసాద్ (32), ఒడిశాకు చెందిన రమేష్ (40), రమేష్ నాయక్ (40), బీహార్‌కు చెందిన ఎండీ జబ్బార్ (32) ఉన్నారు. వీరిలో శివశంకర్‌కుమార్, ముజాహుద్దీన్ మృతిచెందగా, మిగిలిన ఆరుగురు ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్నారు.

ఘటన వివరాలు చెప్పలేక..

తీవ్రగాయాలైన వారు ఘటన వివరాలను చెప్పలేకపోతున్నారు. అందరూ విధులు ముగించుకుని బయటకు వస్తున్న సమయంలో మంటలు చెలరేగాయని, ఏం జరిగిందో తెలియదంటున్నారు. అసలు మంటల్లో ఎంత మంది చిక్కుకున్నారో కూడా తెలియదంటూ రోదిస్తున్నారు. కాగా, బాధితులందరూ ఇతర ప్రాంతాలకు చెందినవారేనని, జీవనోపాధి కోసం వచ్చి ప్రమాదంలో చిక్కుకుపోయినట్లు సహచర కార్మికులు చెబుతున్నారు.

కలెక్టర్ పరామర్శ

జీఎస్ ఎల్లాయ్ కాస్టింగ్ కంపెనీ ప్రమాదంలో తీవ్రగాయాలై ఆంధ్రా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ లక్ష్మీకాంతం శనివారం రాత్రి పరామర్శించారు. బాధితుల నుంచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అగ్నిప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని, తమ అధికారులు ఘటనాస్థలానికి వెళ్లినట్లు తెలిపారు.

పరిస్థితి విషమమే

ఆస్పత్రి చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. అందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

డాక్టర్ ఎం.రవీంద్రనాథ్, ఇన్‌చార్జి
ఆంధ్రా హాస్పిటల్స్

గన్నవరం: బతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులను విధి బలి తీసుకుంది. కాగుతున్న ఐరాన్ ద్రవం లావా మాదిరిగా ఎగిసిపడి శరీరంపై పడి ఇద్దరు అగ్నికి ఆహుతయ్యారు. మరో ఏడుగురు తీవ్రంగా కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషాదకర సంఘటన సూరంపల్లి సమీపంలోని జీఎస్ అల్లాయ్ కంపెనీలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది.

ఘటన జరిగింది ఇలా..

విజయవాడకు చెందిన గంటా ప్రసాదరావు పదేళ్లుగా ఈ ఫ్యాక్టరీ నడుపుతున్నారు. పాత ఇనుమును సేకరించి కరగపెట్టి ఓడలు తయారీ, వివిధ సంస్థలకు అవసరమైన ఐరన్ ఆకృతులను తయారు చేస్తుంటారు. ఇక్కడ రాష్ట్రంతో పాటు ఒడిశా, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు సుమారు 150 మంది పనిచేస్తున్నారు. రోజూ ఉదయం 9 నుంచి 6 గంటల వరకూ వీరంతా విధుల్లో ఉంటారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల పాటు కరెంట్ కోత విధించడంతో పనికి విఘాతం కలిగింది. దీంతో ఐరన్ కరిగించే ట్యాంక్ వద్ద పనిచేసే కార్మికుల్లో ఎనిమిది మంది, అదనంగా మరో రెండు గంటలు పనిలో నిమగ్నమయ్యారు. ఊహించిన విధంగా ఐరన్ కరిగే ట్యాంకర్‌పై ఉన్న మూత పెద్దశబ్దంతో ఎగిసిపడడంతో మృత్యువు కార్మికులను చుట్టుముట్టింది. ఎర్రగా కాగిన ఐరన్ ద్రవం పైకి చిమ్మి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముబారక్‌పై ఎక్కువగా పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో కార్మికుడు అమలాపురానికి చెందిన వి.శివశంకర్‌కుమార్ (38), గుంటూరు జిల్లాకు చెందిన అహ్మద్ ముజాహుద్దీన్ (26) ఆంధ్ర ఆస్పత్రిలో మరణించారు.

అధికారుల పరిశీలన

సీఐ శ్రీధర్‌కుమార్ నేతృత్వంలోని బృందం ఘటన జరిగిన తీరును నమోదు చేసుకున్నారు. జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్, డీసీపీ గజరావు భూపాల్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, డీఎఫ్‌వో నిరంజన్ రెడ్డి, ఏసీపీ విజయభాస్కర్, నూజివీడు ఆర్డీవో సీహెచ్ రంగయ్య పరిశీలించారు. జేసీ నేతృత్వంలో మేజిస్ట్రేరియల్ విచారణకు కలెక్టర్ ఆదేశించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రఘు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, పార్టీ నాయకులు కందిమాళ్ల శ్రీనివాసరావు, దేవగిరి ఓంకార్‌రెడ్డి ఘటనస్థలాన్ని పరిశీలించారు.

కార్మికులంతా పనిలో ఉండగా..

ఈ ప్రమాదం జరిగే ప్రదేశంలో కార్మికులంతా పనిలో ఉంటే, అధిక సంఖ్యలో ప్రాణనష్టం సంభవించేదని కార్మికులు పేర్కొంటున్నారు. మొత్తం 150 మంది కార్మికులకు గానూ 142 మంది సాయంత్రం 5.45 గంటలకు డ్యూటీ దిగివెళ్లిపోయారు. మిగిలిన ఎనిమిది మంది ఐరాన్ ట్యాంకర్ పనిముగించే క్రమంలో నిమగ్నమై ఉండగా ఈ ప్రమాదం జరిగింది.





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సంక్షేమ పథకాల అమల్లో కృష్ణా ఫస్ట్


కలెక్టర్ లక్ష్మీకాంతం

భవానీపురం (విజయవాడ పశ్చిమ): బ్యాంక్ లింకేజీ యూనిట్ల ఏర్పాటు, అర్జీల పరిష్కారం, సాధికారమిత్ర క్లస్టర్ అమలు, చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ వంటి సంక్షేమ పథకాల అమలులో కృష్ణా జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉందని కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. జన్మభూమి కార్యక్రమాల అమలుపై శనివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా అంతటా జన్మభూమి కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకకు సంబంధించి జిల్లాలో 12,38,611 కార్డులు ఉండగా, వాటిలో ఇంతవరకు 8,82,106 కార్డుదారులకు సంక్రాంతి కానుకలు అందించి 71.21 శాతం లక్ష్యాలను సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు.

అర్జీల పరిష్కారంలో 77 శాతం

ఐదో విడత జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజుల్లో ప్రజల నుంచి 67,351 అర్జీలు స్వీకరించగా, వాటిల్లో 51,216 అర్జీలను పరిష్కరించామని, తద్వారా 77 శాతం ఫలితాలను సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామని చెప్పారు. గ్రామసభల్లో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు పెట్టుకున్న అర్జీలను నోడల్ అధికారులు సాధ్యమైనంత వరకూ అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారని తెలిపారు. సాధికార మిత్ర క్లస్టర్ విధానం అమల్లో కృష్ణాజిల్లా నూరుశాతం లక్ష్యాన్ని సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. జిల్లాలో 30,290 క్లస్టర్ల ద్వారా 8,95,308 కుటుంబాలను సాధికార మిత్ర కలిసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్, కాపు కార్పొరేషన్ ద్వారా 2016–17, 2017– 18 సంవత్సరాలకు బ్యాంక్ లింకేజ్ రుణాల ద్వారా యూనిట్లు గ్రౌండ్ చేయడంలో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు.

అమరావతి మారథాన్‌కు అంతా రెడీ


మారథాన్ లోగోను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ నివాస్ తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: నగరంలో ఆదివారం ఉదయం 6 గంటలకు జరగనున్న మూడో అమరావతి మారథాన్ –2018కు అన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో శనివారం ఏర్పాటుచేసిన అమరావతి మారథాన్ ఎక్స్‌పోను కమిషనర్ నివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి 21కే రన్ ప్రారంభమవుతుందన్నారు. రన్ ముగిసిన అనంతరం విజేతలకు సీఎం చంద్రబాబు నగదు బహుమతులు అందిస్తారని చెప్పారు. మూడు కేటగిరీల్లో అమరావతి మారథాన్ నిర్వహిస్తున్నారని, మొదటి కేటగిరీలో 21.1 కేఎం, రెండో కేటగిరీలో 10 కేఎం, మూడో కేటగిరీలో 5 కేఎం రన్ జరుగుతుందని వివరించారు. విజేతలకు రూ.20లక్షల బహుమతి అందజేయనున్నట్లు వివరించారు. ఈ అమరావతి హాఫ్ మారథాన్ రన్ ఐజీఎంసీ స్టేడియం నుంచి ప్రారంభమై పోలీసు కంట్రోల్, ప్రకాశం బ్యారేజీ మీదుగా సీఎం ఇంటికి చేరుకుని తిరిగి స్టేడియంకు వస్తుందన్నారు. రన్‌లో పాల్గొనేందుకు 8వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. రన్‌లో చిన్న పిల్ల దగ్గర నుంచి పెద్దలు, వృద్ధులు, మహిళలు పాల్గొననున్నట్లు తెలిపారు. సినీ యాక్టర్లు, కెన్యా, దక్షిణాఫ్రికాకు చెందిన అథ్లెట్లు పాల్గొంటారని తెలిపారు. స్టేడియం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

దేశానికి యువత గొప్ప సంపద

శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల



జ్యోతి వెలిగిస్తున్న స్పీకర్ కోడెల, మంత్రులు యనమల, దేవినేని, కొల్లు తదితరులు,



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): దేశానికి యువత గొప్ప సంపద అని శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. మచిలీపట్నం హిందూ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన యువకెరటాలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశానికి యువతే స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు మంచి విలువలు, అలవాట్లు విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా నైపుణ్యాలు వెలికితీసేందుకు ప్రయత్నించాలని కోరారు. విదేశాల్లో స్కూలు స్థాయి నుంచే పిల్లల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ యువతను సరైన మార్గంలో నడిపిస్తే అద్భుతమైన విజయాలు సాధిస్తారన్నారు. జనాభాపరంగా రాష్ట్రంలో 35 శాతం యువత ఉన్నట్లు వెల్లడించారు. జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బందరు ప్రాంతాన్ని మహానగరంగా తయారుచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ యువతను భావిభాతర పౌరులుగా తీర్చిదిద్దేందుకు యువకెరటాలు దోహదం చేస్తుందని వివరించారు. రాష్ట్ర న్యాయ, యువజన సంక్షేమం, క్రీడలశాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన మచిలీపట్నంలో 1860లోనే 60 వేల జనాభా ఉండేవారన్నారు. అప్పుడు కుగ్రామాలుగా ఉన్న విజయవాడ, గుంటూరు నేడు మహానగరాలుగా అభివృద్ధి చెందినప్పటికీ బందరు మాత్రం మరింత వెనుకబడిపోయిందని ఆవేదన చెందారు. బందరు పార్లమెంట్ సభ్యుడు కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తితో గడిచిన నాలుగేళ్లుగా యువకెరటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం భారతదేశం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చిలంకుర్తి తాతయ్య, ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ఎల్ఎన్ ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, వైస్ చైర్మన్ పి. కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మార్పును ఆహ్వానిస్తేనే అభివృద్ధి



ప్రశాంసాపత్రాలు అందిస్తున్న షకీల్‌అహ్మాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమం) : మార్పును ఆహ్వానిస్తేనే అభివృద్ధి సాధ్యమని యూజీసీ సహాయ కార్యదర్శి షకీల్‌అహ్మద్ తెలిపారు. కేబీఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగం ఆధ్వర్యంలో 'జీఎస్‌టీ ప్రాక్టీస్ – ఏ క్రాస్ కంట్రీ ఎక్స్‌పీరియన్స్' అంశంపై చేపట్టిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన షకీల్‌అహ్మద్ మాట్లాడుతూ ఏ దేశంలోనైనా ఆర్థిక రంగానికి సంబంధించిన సంస్కరణలు అమలుజే క్రమంలో లోటుపాట్లు సహజమేనని పేర్కొన్నారు. మరో అతిథిగా హాజరైన ఇగ్నో రీజనల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ వి.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకూ ఒకే వస్తువుపై అనేక రకాల పన్నుల వసూళ్లు కొనసాగిందన్నారు. మద్రాస్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు అయూబ్ ఖాన్‌దావుద్, విద్యావేత్తలు దేవామైన్‌దాన్, చార్టర్డ్ అకౌంటెంట్ ఎన్.గంగాధర్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్.రజిత్‌కుమార్, తదితరులు ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ బెజవాడ రామయ్య నిర్వహించగా అధ్యాపకులు సీ.శ్రీనివాసులరెడ్డి, జీఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదరీతిలో మహిళ మృతి

ఎ.కొండూరు: అనుమానాస్పదరీతిలో మహిళ మృతి చెందిన ఘటన ఎ.కొండూరు మంత్రీయా తండా సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన ప్రకారం మైలవరం మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన బి.పద్మకు ఎ.కొండూరు గ్రామానికి చెందిన కిషోర్‌తో 13 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రోజులాగానే కూలి పనులకు పద్మ (30) మంత్రీయా తండా ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలో ఒక మామిడి తోటలోకి వెళ్లి చీరతో మామిడి చెట్టుకు ఉరివేసుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కొందరి సమాచారం మేరకు మామిడి తోటలోకి వెళ్లి చూడగా పద్మ అప్పటికే మృతి చెంది ఉంది. మృతికి గల కారణాలు అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి తల్లి సుంకర వర లక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదంగా కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

సుందరీకరణ పనుల్లో జాప్యం సహించం

ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న లక్ష్మీపార్థసారథి

రామవరప్పాడు(గన్నవరం): సుందరీకరణ పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని అమరావతి అభివృద్ధి సంస్థ సీఎండీ లక్ష్మీ పార్థసారథి హెచ్చరించారు. రమేష్ హాస్పిటల్ కూడలి నుంచి రామవరప్పాడు రింగ్ కూడలి వరకు 16వ జాతీయ రహదారికి ఇరువైపులా ఏడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పచ్చదనం సుందరీకరణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ప్రముఖులు పర్యటించే ఈ రహదారిని ఆధునిక హంగులతో అభివృద్ధి చేయాలని సూచించారు. రహదారికి ఒకవైపు ఏడీసీ అటవీ విభాగం అధికారులు ఏర్పాటు చేసిన మొక్కలు, కాలిబాట పక్కన గ్లీనరీ, పాదాచారులు కూర్చోవడానికి సిమెంట్ బెంచీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రిళ్లు రహదారి శోభయమానంగా దర్శనమిచ్చేందుకు అకర్షణీయమైన విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దాలని ఆదేశించారు. పర్యటనలో ఏడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ మోజెస్‌కుమార్, సీనియర్ ఇంజినీరు సూర్యారావు, అటవీ విభాగం అధికారులు హుస్సేన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత ?

హనుమాన్‌జంక్షన్ రూరల్ : నిషేధిత గంజాయి సరఫరా చేస్తూ యువతను బాసినలుగా మార్చుతున్న ఓ వ్యక్తిని హనుమాన్‌జంక్షన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా గట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న గంజాయి వ్యాపారం కూపీ లాగే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. హనుమాన్‌జంక్షన్, గన్నవరం, నూజివీడు, ఏలూరు ప్రాంతాల్లో గంజాయి వ్యాపారాన్ని విస్తరించి జోరుగా అమ్మకాలు సాగిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యార్థులను టార్గెట్ చేసుకుని నెమ్మదిగా వాళ్లకు గంజాయి అలవాటు చేయటం, ఆ తర్వాత పూర్తిగా బానిసలు మార్చటం ఈ ముఠా వ్యవహారంగా తెలుస్తోంది. న్యూ ఇయర్ వేడుకల్లో గంజాయి స్పెషల్ ఐటంగా ఏర్పాటు చేసేందుకు భారీ మొత్తంలో తెచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. రాత్రంతా గంజాయి మత్తులో మునిగి తేలేందుకు కొందరు యువకులు గంజాయి తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. గంజాయి వ్యసనంగా మారిన విద్యార్థులు, యువతకు విక్రయిస్తే యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్న ఈ ముఠాలో హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ఓ బడాబాబు కుమారుడి హస్తం ఉన్నట్లు సమాచారం. పోలీసులు లోతైన దర్యాప్తు సాగిస్తున్నారు. అదుపులో ఉన్న వ్యక్తి నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

సహ విద్యార్థికి స్నేహహస్తం



ఆర్థిక సాయం అందిస్తున్న విద్యార్థులు

పెనమలూరు: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న తమ సహ విద్యార్థికి స్నేహితులు ఆపన్న హస్తం అందించారు. పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యనభ్యసిస్తున్న గోవర్ధన్ వైద్య ఖర్చులు నిమిత్తం సహ విద్యార్థులు, సిబ్బంది నుంచి విరాళంగా సేకరించిన రూ.24 వేలు నగదును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శివాజీబాబు చేతులమీదుగా గోవర్ధన్ తండ్రికి అందించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్యామ్, విద్యార్థులు ఆనంద్, రోహిత్, శేఖర్, ఉమామహేష్, హేమంత్, సుమంత్ పాల్గొన్నారు.

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు : కైకలూరు : బి.శ్యామలరాజు - 9010855504 ; కలిదిండి : ఇస్రాయెల్ - 9849970637
ముదినేపల్లి రూరల్ : జి. రామ్మోహనరావు -9705580373; మండవల్లి : బీవీ వీరాంజనేయులు - 9010855536



మీ కోసం

విద్యుత్ బిల్లుల చెల్లింపు...

- **కైకలూరు** : కైకలూరు విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఉదయం నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని బిల్ కలెక్టర్ ఏవిఎల్ శ్రీనివాసరావు చెప్పారు.
- **ముదినేపల్లి రూరల్** : ముదినేపల్లిలో ఉదయం 9గంటలనుంచి విద్యుత్‌బిల్లులు చెల్లించవచ్చని బిల్ కలెక్టర్ మన్నన్ తెలిపారు.
- **మండవల్లి:** మండవల్లి విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని బిల్ కలెక్టర్ ఎస్.వి. సురేష్ తెలిపారు.

వీఐపీ డైరీ

- **కైకలూరు** : మండల తహసీల్దారు శ్రీను నాయక్, ఎంపీడీవో దివాకర్, వ్యవసాయాధికారి రమేష్ నాయుడు, ఎంఈవో రామారావు జన్మభూమి – మీ మీ ఊరు కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- **ముదినేపల్లి రూరల్** : ఎంపీడీవో కె.మణికుమార్,తహసీల్దార్ ఎం.సూర్యారావు శ్రీహరిపురం.ఈడేపల్లి,కొరగుంటపాలెం,పెదగొన్నూరు జన్మభూమి గ్రామసభల్లో పాల్గొంటారు.
- తహసీల్దార్ పి. మధుసూదనరావు, ఎంపీడీవో వి. పూర్ణచంద్రరావు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ధర్నా విజయవంతం చేయండి

ముదినేపల్లిరూరల్ : సీపీఎస్ రద్దుకోరుతూ పెన్షన్ సాధనసమితి ఆధ్వర్యంలో పాత తాలూకా కేంద్రాల్లో 9వతేదీన నిర్వహించనున్న ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఆగొల్లు హరికృష్ణ కోరారు. సంఘం సమావేశం ముదినేపల్లిలో శనివారం జరిగింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవితాలకు భద్రతలేని సీపీఎస్ రద్దు చేయాలని మూడేళ్లుగా పోరాటం చేస్తున్నా పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదన్నారు. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షన్ సాధన సమితిగా ఏర్పడి రద్దుకోసం పోరాటం చేస్తున్నాయన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్రప్రసాద్, నేతలు బి.జాన్సన్‌బాబు, ఆర్.శ్రీహరి, ఆర్.శ్రీనివాసరావు, సి.హెచ్.చక్రధర్, వి.ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ

కైకలూరు
విజయలక్ష్మి : ఎమ్‌సీఏ
మాగంటి : హలో!
ముదినేపల్లి:
పూర్ణిమా థియేటర్ : ఎమ్‌సీఏ



జన్మభూమిలో ఆరని నిరసన సెగలు

- గతంలో ఇచ్చిన అర్జీల సంగతేంటని ప్రశ్నలు
- అభివృద్ధికి ప్రభుత్వం అంకితం : యనమల
- పోలవరం ప్రజల జీవనాడి : దేవినేని ఉమా
- జయమంగళపై కామినేని ఆగ్రహం

ముదినేపల్లిరూరల్ : ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 5వ విడత 'జన్మభూమి–మా ఊరు' గ్రామసభల్లో ప్రజల నిరసన ఘటనలు మిన్నంటుతున్నాయి. శనివారం జరిగిన కార్యక్రమాల్లోనూ అదే పునరావృతమయ్యింది. గతంలో జరిగిన జన్మభూమి గ్రామసభల్లో ఇచ్చిన అర్జీల సమస్యలను ఇంతవరకు పరిష్కరించలేదని, ముందు ఆ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి.

అభివృద్ధికి అంకితం : యనమల

అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం అంకితమై పనిచేస్తుందని ఆర్థిక మంత్రి యనమలరామకృష్ణుడు అన్నారు. శనివారం జరిగిన పలు జన్మభూమి గ్రామసభల్లో ఆయనతో పాటు మంత్రులు ఉమామహేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొని మాట్లాడారు.

ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెంలో గ్రామసభలో యనమల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో నవ్యాంధ్రను ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నీటిపారుదల శాఖామంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ప్రజల జీవనాడి అన్నారు. దీనిని సకాలంలో పూర్తి చేసి డెల్టా ఆయకట్టు స్థిరీకరిస్తామని చెప్పారు. మాజీ



మాట్లాడుతున్న మంత్రి యనమల, పక్కన మంత్రి ఉమా

ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, టీడీపీ ప్రముఖులు మాట్లాడారు. తొలుత మంత్రులు యనమల, దేవినేని స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

వింజరం (కైకలూరు) : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ అన్నారు. జన్మభూమి– గ్రామ సభలో భాగంగా కైకలూరు మండలం వింజరం, శ్యామలాంబపురం గ్రామల్లో సభలు జరిగాయి.

గ్రామసభలతో పేదలకు లబ్ధి

ముదినేపల్లిరూరల్ : జన్మభూమి గ్రామసభలతో పేదలకు పలురకాల లబ్ధి చేకూరుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖామంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలోని కలిదిండి, ముదినేపల్లి, మండలాల్లోని పలు ప్రాంతాల్లో జరిగిన జన్మభూమి గ్రామసభల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు.కార్యక్రమాల్లో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై ప్రశంసల వెల్లువ

ముదినేపల్లిరూరల్ : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య వ్యత్యాసాన్ని తెలియజేస్తూ ఒక విద్యార్థి చెట్టు–పువ్వు ఆకారంలో ఇచ్చిన ప్రదర్శనకు అధికారుల ప్రశంసలు వెల్లువెత్తాయి. మండలంలోని చేవూరులో స్థానిక యూపీ స్కూల్ విద్యార్థి పెనుమాల లక్ష్మీ ప్రసన్న ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న అన్న నినాదంతో జన్మభూమి సభలో అధికారుల ముందు సాక్షాత్కరించింది.ప్రత్యేకాధికారి ఎండీ యాకూబ్ బాషా, తహసీల్దార్ ఎం.సూర్యారావు, ఎంపీడీవో కె.మణికుమార్, ఎంఈవో బొడ్డు శ్రీనివాసరావు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ప్రధానోపాధ్యాయుడు కలిదిండి కిషోర్‌బాబు విద్యార్థి మనోభావాల్ని అధికారులకు వివరించారు. దీంతో అధికారులంతా విద్యార్థిని ప్రశంసల్లో ముంచెత్తి ఉపాధ్యాయులను అభినందించారు.



మాకూ కార్యక్రమాలున్నాయ్..కూర్చోండి

భాస్కరరావు పేట(కలిదిండి) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ భాస్కరరావు పేటలో జరిగిన గ్రామసభలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి,మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జయమంగళ ప్రసంగించిన అనంతరం...తాను మరో గ్రామానికి వెళతానంటూ అనుమతి అడిగారు. దీంతో మంత్రి కామినేని మీకే కాదు మాకూ కార్యక్రమాలున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వేదిక దిగి వస్తుండగా ఒక రైతు నాగన్నచెరువు రోడ్డు వేయిస్తానన్నారు వేయలేదండీ అంటూ ప్రశ్నించారు. దానికి రూ.2 కోట్లు మంజూరు చేశానని త్వరలో నిర్మాణం చేస్తారని అన్నారు. గతంలోనూ ఇలాగే చెప్పారు చేయలేదని వాదనకు దిగడంతో పోలీసులు అతన్ని తోసుకుంటూ వెళ్లి మంత్రికి అడ్డు తొలగించారు. టీడీపీ నేతలు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కలిదిండి : యువత తలుచుకుంటే సాధించలేనిదీ ఏమీ ఉండదని పలు సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనడం అభినందనీయమని కలిదిండి సర్పంచి షేక్ నాజీమా అన్నారు. శానివారం యువ ఫౌండేషన్ ఆధ్యర్యంలో ఏఎంసీ ప్రాంగణంలో 60 వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన యువత స్వచ్ఛంద విరాళాల ద్వారా సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.పవన్ చెప్పారు. అనాథ పిల్లలకు, వికలాంగులకు, వృద్ధులకు సహాయం చేయాలనేదే తమ ఉద్దేశమని చెప్పారు. ఉపాధ్యక్షుడు ఎస్.సాయిరామ్, కె.అఖిల్, సి.హెచ్.సాయి పవన్, పి.కృష్ణసాయి, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచి నాజీమా

మండలానికి 'కాంగ్రెస్' పదవులు

మండవల్లి : మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన ముత్యాల జీవన్‌కుమార్‌ను జిల్లా యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యదర్శిగా, ఉనికిలి గ్రామానికి చెందిన దాసరి తరుణ్‌కుమార్‌ను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.కృష్ణమురళీ నియమించారని పీసీసీ సభ్యుడు మన్నేపల్లి ఆదాం శనివారం తెలిపారు. జీవన్‌కుమార్, తరుణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తమ శక్తిమేరకు కృషి చేస్తామని తెలిపారు. వీరి నియామకంపై పీసీసీ సభ్యులు మన్నేపల్లి ఆదాం, బ్లాక్–1 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతలపాటి పీటర్‌పాల్‌ప్రసాద్, బేతపూడి తంబి హర్షం ప్రకటించారు.



జీవన్‌కుమార్



తరుణ్‌కుమార్

వైఎస్ స్వర్ణయుగం జగన్‌కే సాధ్యం



పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న డీఎన్నార్ పార్టీ నాయకులు

కానుకొల్లు(మండవల్లి): దివంగత ముఖ్యమంత్రి, మహానేత వై.ఎస్.రాజశేఖరెడ్డి స్వర్ణయుగం తిరిగి తీసుకురావాలంటే ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని కానుకొల్లు గ్రామంలోని దళితవాడల్లో రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమం మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల బీసీ విభాగం అధ్యక్షుడు శొంఠి వీరముసలయ్య ఆధ్వర్యంలో శనివారం జరిగింది. డీఎన్నార్ మాట్లాడుతూ వైఎస్ హయాంలో ఫీజురీయింబర్స్‌మెంట్, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీలు, రైతులకు దాళ్వా, సార్వా రెండు పంటలు, 108 సేవలు తిరిగి తీసుకొచ్చే సత్తా ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. ఆయన ప్రకటించిన నవరత్నాలతో వైఎస్ కాలం నాటి పాలన రాష్ట్రంలో తిరిగి వస్తుందని తెలిపారు. నేతలు నిమ్మగడ్డ భిక్షాలు, చేబోయిన వీర్రాజు ,పరింకాయల వెంకటేశ్వరరావు, గుడివాడ బాలాజి, గుడివాడ బాబి, చందు శ్రీనివాసరావు, మెండెం ఏసుమణి, షేక్‌గౌస్‌బేగ్, బోనం శేషగిరి, ఎంపీటీసీ కొండారెడ్డి, జల్లి శౌరి, పెడసనగంటి కనకాచారి, ఎరిచర్ల సులోచన, ఉప్పాడ రాధా, సాతునూరి జోజిరాణి, గోబోతుల శ్రీనివాసరావు, గ్రామ చిట్టూరి నరేష్, రాజులపాటి సత్యనారాయణ, గోబోతుల పెద్దిరాజు, పరసా సత్యనారాయణ, తమ్మన నాగరాజు, ఎలిమెల రాజారత్నం, చిగురుకోట వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు భేష్



సానారుద్రవరం(కలిదిండి) : జాతీయ సేవా పథకం కింద విద్యార్థులు చేసే సేవలను ప్రజలు, ప్రభుత్వం గుర్తించాలని పలువురు వక్తలు కోరారు. సానారుద్రవరం గ్రామంలో డిసెంబరు 31 నుంచి 6వతేదీ వరకు 50 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చేసిన సేవా కార్యక్రమాలను శనివారం ముగింపు సభలో ప్రశంసించారు. సర్పంచి దాసరి అనిత అధ్యక్షతన పంచాయతీ వద్ద జరిగిన సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దాసరి అబ్రహం లింకన్, సర్పంచి అనిత మాట్లాడారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలో పడమటిపాలెం, ఎస్ఆర్‌పీ అగ్రహారం, గుర్వాయపాలెం, ఇప్పుడు సానారుద్రవరం గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఉప సర్పంచి రాంబాబు, నీటిసంఘం అధ్యక్షుడు మల్లిఖార్జునరావు,అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికల ర్యాలీపై మంత్రి అభినందన

కొత్తూరు(కలిదిండి) : మండలంలోని అమరావతి పంచాయతీ కొత్తూరు గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఉదయం ఆత్మగౌరవదీక్ష ర్యాలీ నిర్వహించారు. 'చెంబు చచ్చింది-ఆత్మగౌరవదీక్ష బతికింది' అంటూ నినాదాలు చేశారు. అదేమార్గంలో భాస్కరరావుపేట గ్రామ సభకు వెళుతున్న శాసనసభ్యుడు, మంత్రి కామినేని శ్రీనివాస్ కారుదిగి బాల బాలికలను, ఉపాధ్యాయులను అభినందించారు. ర్యాలీలో ప్రధానోపాధ్యాయిని హ్యామ్లిన్, ఎస్.ఎన్.బెనర్జీ, వై.వెంకటేశ్వరరావు, యు.వెంకటేశ్వరరావు, శ్రీదేవి, విజయలక్ష్మి, శశిగణపతి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి కామినేని

నేడు, రేపు భుజబలపట్నంలో రచ్చబండ

మండవల్లి: కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామంలో 7,8 తేదీల్లో రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాలు జరుగుతాయని నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనవలసినదిగా ఆయన కోరారు.

(దేవాదాయ - ధర్మాదాయ శాఖ)
శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారి దేవస్థానం, కలిదిండి గ్రామము మరియు మండలం కృష్ణాజిల్లా
సీల్డు కొటేషన్స్ మరియు టెండరు కమ్ బహిరంగవేలం ప్రకటన

కృష్ణాజిల్లా, కలిదిండి మండలము మరియు గ్రామములో వేంచేసియున్న శ్రీ పాతాళ భోగేశ్వరస్వామి వారి దేవస్థానం నందు జరుగు వార్షిక మహాశివరాత్రి మహోత్సవములు ది. 11-02-2018 నుండి ది. 15-02-2018వరకు జరుగు ఉత్సవములను ఈ క్రింది షెడ్యూలు నందు తెలిపిన వివిధ పనులకు సీల్డు కొటేషన్సు, టెండరు-కమ్-బహిరంగ వేలము ప్రకటన కోరుబడుచున్నది.

షెడ్యూలు

వరుస సంఖ్య	పనుల వివరములు	కాల పరిమితి	ధరావత్తు	సీల్డు కొటేషన్స్ యివ్వు తేది	సీల్డు కొటేషన్స్ స్వీకరించి మరియు తెరచు తేది, సమయం ప్రదేశము	టెండరు కమ్ బహిరంగవేలం నిర్వహించుతేది సమయం, ప్రదేశం
1.	విద్యుత్ అలంకరణ (LED Lightning Decoration) బొమ్మలు, జనేటర్స్, కటౌట్, లైటింగ్, మొదలగునవి	11.02.2018 నుండి 15.02.2018 వరకు	రూ. 10,000	ది. 16.01.2018 మంగళవారము సాయంత్రము గం. 5.00ల వరకు శ్రీ పాతాళ భోగేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యాలయం వద్ద యివ్వబడును.	ది. 17.01.2018 బుధవారము ఉదయము గం. 11.00ల వరకు సీల్డు కొటేషన్స్ స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం గం. 2.00లకు హాజరైన టెండరుదార్లు, కొటేషన్స్‌దార్లు, డిపార్టుమెంటు అధికారుల సమక్షంలో శ్రీ స్వామివారి దేవస్థానం వద్ద తెరువబడును.	ది. 25.01.2017 గురువారము ఉదయం గం. 11.00లకు శ్రీ స్వామివారి దేవాలయం వద్ద వాహన పార్కింగ్ నిమిత్తము టెండరు కమ్ బహిరంగ వేలముపాట నిర్వహించబడును.
2.	మైక్ & సౌండ్ సిస్టమ్	11.02.2018 నుండి 15.02.2018 వరకు	రూ. 2,000			
3.	ఐరన్ షెడ్డు సైజు (60x105) స్టేజ్ (24x18) క్లాత్ డెకరేషన్	11.02.2018 నుండి 15.02.2018 వరకు	రూ. 3,000			
4.	షామియానాలు, కుర్చీలు టేబుల్స్, వంటసామాగ్రితో సహా	11.02.2018 నుండి 15.02.2018 వరకు	రూ. 2000			
5.	దేవస్థానమునకు వివిధ సైజులలో బాదులు, కర్రలు సప్లయ్ చేయుట	11.02.2018 నుండి 15.02.2018 వరకు	రూ. 5,000			
6.	తాటాకు పందిళ్ళు, క్యూలైన్సు ఏర్పాటు చేయుటకు	11.02.2018 నుండి 15.02.2018 వరకు	రూ. 5,000			
7.	సున్నం, రంగులు వేయుటకు		రూ. 2,000			
8.	కిరాణాసామాగ్రి, పూజాసామాగ్రి	11.02.2018 నుండి 15.02.2018 వరకు	రూ. 1,000			
9.	వాహనముల పార్కింగ్ లైసెన్సుకు	12.02.2018 నుండి 14.02.2018 వరకు	రూ. 2000			

పైన తెలిపిన పనుల నిమిత్తము సీల్డు కొటేషన్స్ ఫారంనకు రూ. 100/- శ్రీ స్వామివారి దేవస్థానం కార్యాలయంనందు చెల్లించి సీల్డు కొటేషన్స్ పొందవచ్చును. సదరు సీల్డు కొటేషన్స్ వివరములు సక్రమముగా వ్రాసి షెడ్యూలునందు తెల్పిన సమయంనందు సీల్డు కొటేషన్స్‌తోపాటు ధరావత్తును డిమాండ్ డ్రాఫ్టు రూపంలో జతపర్చవలెను. ప్రతి ఐటమ్‌నకు విడివిడిగా సీల్డు కొటేషన్స్, ధరావతులు సమర్పించవలెను. సదరు సీల్డు కొటేషన్స్ షెడ్యూలు నందు చూపబడిన సమయమున డిపార్టుమెంటు అధికారులు, వ్యవస్థాపక కుటుంబసభ్యులు, భక్తుల సమక్షములో తెరువబడును. మిగతా వివరములకు కలిదిండి లేక కైకలూరు గ్రూపు దేవస్థానములు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

అడివి వెంకట గంగాధరశర్మ, వ్యవస్థాపక కుటుంబసభ్యులు, కలిదిండి. 5.1.2018 సం/- శింగనపల్లి శ్రీనివాసరావు, మేనేజరు. 98666 31608



భవిష్యం

మేషం: కొన్ని వ్యవహారాలు ముందుకు సాగవు. వృథా ఖర్చులు. కుటుంబంలో చికాకులు. మానసిక అశాంతి. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

వృషభం: రాబడి కన్నా ఖర్చులు పెరుగుతాయి. దూరప్రయాణాలు. బాధ్యతలు పెరుగుతాయి. అనారోగ్యం. వ్యాపారాలు ముందుకు సాగవు. ఉద్యోగాలలో చిక్కులు.

మిథునం: ఆసక్తికరమైన సమాచారం. విందువినోదాలు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఇంటర్వ్యూలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.



కర్కాటకం: ఆదాయానికి మించి ఖర్చులు. దూరప్రయాణాలు. బంధువులతో తగాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు.

సింహం: నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. విలువైన వస్తువులు కొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలమైన పరిస్థితి. దేవాలయాలు సందర్శిస్తారు.

కన్య: బంధువులతో తగాదాలు. కష్టానికి తగ్గ ఫలితం కనిపించదు. ఆస్తి వివాదాలు. పనుల్లో ఆటంకాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు. కళాకారులకు గందరగోళ పరిస్థితి.

తుల: ఉద్యోగ యోగం. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. పరిస్థితులు అనుకూలిస్తాయి. బంధువుల కలయిక. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. దేవాలయ దర్శనాలు.

వృశ్చికం: ఆసక్తికరమైన సమాచారం. విందు వినోదాలు. యత్నకార్యసిద్ధి. మీ అంచనాలు నిజమవుతాయి. స్థిరాస్తి వృద్ధి. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

ధనుస్సు: ఆదాయం తగ్గుతుంది. మానసిక ఆందోళన. దూర ప్రయాణాలు చేస్తారు. బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.

మకరం: కుటుంబ, ఆరోగ్య సమస్యలు. మానసిక ఆందోళన కలిగే అవకాశం ఉంది. ఆలోచనలు స్థిరంగా ఉండవు. పనులలో ఆటంకాలు. ఆలయ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి.

కుంభం: ఉద్యోగ ప్రయత్నాలలో ముందడుగు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితులు, వాహన యోగం. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి దాయకంగా ఉంటాయి.

మీనం: కొత్త విషయాలు గ్రహిస్తారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. మీ ఊహలు నిజం కాగలవు. శుభ వర్తమానాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ముందుకు సాగుతారు.

– సింహంభట్ల సుబ్బారావు

తిరుమల సమాచారం



● **సుదర్శనం :** రూ. 300 దర్శనం ఈ నెల 9 నుంచి మార్చి 31 తేది వరకు అందుబాటులో ఉన్నాయి.
● **వసతి గదులు :** మార్చి నుంచి అందుబాటులో ఉన్నాయి.బుక్కింగ్ చేసుకునే వారు గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావలెను.
● **డైరీ :** తిరుమల తిరుపతి దేవస్థానం 2018 డైరీ రూ. 120, క్యాలెండర్ రూ. 90లకు అందుబాటులో కలవు.
● **ఆర్జిత బ్రహ్మోత్సవం :** (ప్రతిరోజు) మధ్యాహ్నం 1.30గంటలకు – రూ. 200 (ఒకరికి)
● **అష్టదళపాద పద్మారాధన :** ప్రతి మంగళవారం ఉదయం 5.30 గంటలకు – రూ. 1250 (ఒకరికి)
● **సుప్రభాతం :** ప్రతిరోజు ఉదయం 2.30 గంటలకు – రూ. 120 (ఒకరికి)
● **ఊంజల సేవ :** ప్రతిరోజు మధ్యాహ్నం 1.00 గంటకు – రూ. 200 (ఒకరికి)
● **వసంతోత్సవం :** ప్రతిరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు – రూ. 300 (ఒకరికి)
● **నిజపాదదర్శనం :**ప్రతి శుక్రవారం ఉదయం 5.30 గంటలకు – రూ. 200 (ఒకరికి)
● **విశేషపూజ :** ప్రతి సోమవారం ఉదయం 6.30 గంటలకు – రూ. 600 (ఒకరికి)
● **కల్యాణం :** ప్రతిరోజు మధ్యాహ్నం 12గంటలకు – రూ. 1000 (జంటకు)
● తిరుమలలో వివాహం చేసుకునే వారు ముందుగా టీటీడీ ఈ–దర్శనం కౌంటర్ వద్ద నమోదు చేయించుకోవాలి.
● దర్శనం, గదులను 90 రోజులు ముందు నుంచి జారీ చేస్తారు.
● **ఆర్జిత సేవల టిక్కెట్లు** 60 రోజుల ముందు నుంచి జారీ చేస్తారు.
● **కౌంటర్ పనిచేయు వేళలు :**ఉదయం 9 నుంచి 1గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6గంటల వరకు, ఫోన్ : 220172, ప్రతి మంగళవారం సెలవు

– చిలకలపూడి (మచిలీపట్నం)

తిరుమలలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:
ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు
సహస్రదీపాలంకరణసేవ–ఖాళీలేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు

విమాన వేళలు

గన్నవరం విమానాశ్రయం నుంచి విమానాలు బయలుదేరు వేళలు

న్యూఢిల్లీకి		
ఎయిరిండియా	09.05	ప్రతిరోజు
ఎయిరిండియా	17.30	ప్రతిరోజు
ఎయిరిండియా	20.40	ప్రతిరోజు
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	08.35	ప్రతిరోజు
ఎయిరిండియా	12.10	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	బుధవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజు
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజు
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.45	ప్రతిరోజు
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.10	ప్రతిరోజు
ఎయిరిండియా	08.25	గురు, శుక్ర, శని, ఆది
చెన్నైకు		
ఎయిరిండియా	12.35	ప్రతిరోజు
స్పైస్‌జెట్	17.20	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
విశాఖపట్నానికి		
ఎయిరిండియా	12.30	బుధవారం మినహా
ఎయిరిండియా	15.35	బుధవారం మాత్రమే
ఎయిరిండియా	18.40	గురు, శుక్ర, శని, ఆది
తిరుపతికి		
ఎయిరిండియా	15.30	బుధవారం మినహా అన్ని రోజులు

ప్రజల అవసరాలేంటో బాగా తెలుసు : మంత్రి యనమల


మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి యనమల

మచిలీపట్నం టౌన్ (మచిలీపట్నం): రాష్ట్ర ప్రజల అవసరాలేంటో ప్రతిపక్షం కంటే తమకే బాగా తెలుసని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని పలు పనులను తమ ప్రభుత్వం చేసి చూపిస్తోందన్నారు. 2018–19 రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి ముసాయిదాను ప్రస్తుతం తయారు చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది రూ.1.56 లక్షల కోట్లతో బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ఈ ఏడాది ఈ బడ్జెట్ ఎంత మేర ఉంటుందో ఇప్పుడే చెప్పలేమన్నారు. బందరు పోర్టు నిర్మాణం జరిగితేనే ఈ ప్రాంతంతో పాటు జిల్లా అభివృద్ధి చెందుతుందని, రైతులు పోర్టు, అనుబంధ పరిశ్రమలకు అవసరమైన భూములు ఇచ్చి సహకరించాలని కోరారు. మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మున్సిపల్ చైర్మన్ బాబాప్రసాద్ పాల్గొన్నారు.

వీఐపీ డైరీ

● **కైకలూరు :**ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ కైకలూరు నియోజకవర్గంలో జరుగనున్న జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో పాల్గొంటారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు.
● రాష్ట్ర న్యాయ, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం మచిలీపట్నంలో ఉంటారు.
● బందరు పార్లమెంట్ సభ్యుడు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ కొనకళ్ల నారాయణరావు ఉదయం తిరుపతి, అనంతరం కడపలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.
● జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ఉదయం విజయవాడ, సాయంత్రం మచిలీపట్నంలో ఉంటారు.
● కలెక్టర్ బి. లక్ష్మీకాంతం, జాయింట్ కలెక్టర్ కె విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్–2 పి బాబూరావు, జెడ్పీ సీఈవో కె.శ్రీదేవి విజయవాడలో ఉంటారు.

–చిలకలపూడి(మచిలీపట్నం)

దుర్గగుడి సమాచారం



● తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరుస్తారు. అనంతరం దుర్గమ్మకు వస్త్రాలంకరణ సేవ చేస్తారు.
● తెల్లవారుజామున 4 గంటలకు ఖడ్గమాల పూజ, ఉదయం 6 గంటలకు యాగశాలలో నవగ్రహ హోమం జరుగుతాయి.
● ఉదయం 6, 10.45, 4.45 గంటలకు త్రికాలార్చన నిర్వహిస్తారు.
● ఉదయం 7 నుంచి 9 గంటల వరకు రుద్ర హోమం, అనంతరం లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమం జరుగుతాయి.
● ఉదయం 11 గంటలకు సౌభాగ్య ప్రదాయిని పూజ చేస్తారు.
● మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ పుష్పార్చన, సాయంత్రం 6 గంటలకు పంచహారతులు సమర్పిస్తారు.
● రాత్రి 10 గంటలకు ఆలయం మూసివేస్తారు.

–ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమం)

చికెన్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ రైతు ధర	:	89, 96, 106
చికెన్ విత్ స్కిన్	:	172
చికెన్ విత్ స్కిన్‌లెస్	:	182

కోడి గుడ్ల ధరలు (నెక్)
రైతు ధర -రూ.3.96

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర, వాయువ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటుంది. ఉత్తరప్రదేశ్, బిహార్‌ల్లోని ఉత్తర ప్రాంతాల్లో చలి పెరగనుంది. దేశంలోని వాయువ్య ప్రాంతంతోపాటు తూర్పు మధ్యప్రదేశ్‌లో చలి గాలులు వీచే అవకాశం ఉంది.

గుంటూరు
వాతావరణం
వాతావరణం
గరిష్ఠం కనిష్ఠం
గరిష్ఠం కనిష్ఠం
30.4°/15.4°
29.7/17.0

జాతీయం

నగరం	గరిష్ఠ	కనిష్ఠ
ఢిల్లీ	20.8	04.2
కోల్‌కతా	23.4	11.6
బెంగళూరు	27.2	14.7
ముంబై	29.6	15.7
చెన్నై	29.1	20.0

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ఠ/కనిష్ఠ	పట్టణం/జిల్లా	గరిష్ఠ/కనిష్ఠ
నెల్లూరు	31.0/20.5	రాజమండ్రి	29.9/18.2
కర్నూలు	31.0/17.5	తాడేపల్లిగూడెం	29.9/18.2
అనంతపురం	30.8/15.0	చిత్తూరు	29.8/15.8
ఒంగోలు	30.6/20.1	తిరుపతి	29.8/15.8
మహబూబ్‌నగర్	30.6/16.1	విజయవాడ	29.7/17.0
నిజామాబాద్	30.6/14.4	హైదరాబాద్	29.6/13.1
మెదక్	30.5/10.3	రంగారెడ్డి	29.6/13.1
గుంటూరు	30.4/15.4	వరంగల్	29.3/12.0
కడప	30.3/16.0	నల్లగొండ	29.1/15.4
ఖమ్మం	30.2/09.4	కాకినాడ	29.0/18.5
ఆదిలాబాద్	30.2/07.4	శ్రీకాకుళం	28.8/14.4
కరీంనగర్	30.0/11.2	విజయనగరం	28.8/14.4
ఏలూరు	29.9/18.2	విశాఖపట్నం	28.7/18.5

బుల్లితెర W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 సత్యవాక్యం
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 సరదాగా కాసేపు
ఉ.09.30 జ్యూక్ బాక్స్
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.11.30 సదరన్ స్పైస్
మ.12.30 ప్రాపర్టీ ప్లస్
మ.02.30 న్యూస్ ఫీచర్
సా.04.30 కొత్త ప్రపంచం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 జనపథం
సా.06.00 రీజనల్ న్యూస్
సా.06.30 న్యూస్ ఫీచర్
రా.07.30 స్టార్ స్టార్
రా.08.00 మనసులో మాట
రా.09.00 న్యూస్ 360


టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 బోస్
ఉ.09.30 జగపతి
మ.12.00 అపరిచితుడు
మ.03.00 కత్తి కాంతారావు
రా.09.00 ఛాలెంజ్



హెచ్‌బీవో
ఉ.06.00 లైసెన్స్ టు వెడ్
ఉ.07.27 గ్రీన్ లాంతర్న్
ఉ.09.30 స్టోర్క్స్
మ.12.42 300
సా.06.56 వార్ డాగ్స్




మా మూవీస్
ఉ.07.00 నిర్ణయం
ఉ.09.00 లీడర్
మ.12.00 సీమటపాకాయ్
సా.06.00 పసివాడి ప్రాణం
రా.09.00 అశోక్



మూవీస్ నౌ
ఉ.06.45 ద రాత్ ఆఫ్ వజ్రా
ఉ.09.00 క్లాష్ ఆఫ్ ద టైటన్స్
ఉ.11.00 ద జంగిల్ బుక్
సా.04.15 రష్ అవర్ 2
సా.06.05 ద అవెంజర్స్



స్టార్ మూవీస్
ఉ.06.11 పిక్సెల్స్
ఉ.08.04 ద ఇంక్రెడిబుల్స్
ఉ.10.23 కార్స్
మ.12.43 టర్బో
సా.04.42 ఫ్రోజెన్



జీ సినిమా
ఉ.04.45 బ్లాక్ అండ్ వైట్
ఉ.10.11 చెన్నై ఎక్స్‌ప్రెస్
మ.01.08 హమ్ ఆప్ కే హై కౌన్
సా.05.27 కమాండో 2
రా.08.00 ఏక్ రిష్తా:ద బాండ్ ఆఫ్ లవ్

నిరసనలు...నిలదీతలు



ఉయ్యూరు మండలం కాటూరులో టీడీపీ నాయకులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పోతురాజు తదితరులు

- జన్మభూమిలో మంత్రులకు చెమటలు పట్టిస్తున్న ప్రజలు
- టీడీపీకి ఓటెయ్యకుంటే కష్టాలంటూ బెదిరింపులు
- ప్రొటోకాల్ పాటించని అధికారులు

సాక్షి, అమరావతిబ్యూరో :

కృష్ణా జిల్లాలో ఐదో రోజు నిర్వహించిన జన్మభూమిలో నిరసనలు, నిలదీతలతో అధికారుల కు, ప్రజాప్రతినిధులకు స్థానికులు చెమటలు పట్టించారు. ఓట్లు వేయిం చుకొని గద్దెనెక్కిన తరువాత ప్రజా సమస్యలు పట్టించుకోకపోతే ఎలా అంటూ మహిళలు నిలదీశారు. మళ్లీ ఓట్ల కోసం వస్తే మేమేంటో చూపిస్తామంటూ హెచ్చరికలు జారీచేశారు. ప్రజా సమస్యలపై వస్తున్న ప్రశ్నలకు సమాధాన మిచ్చుకోలేని అధికారులు పోలీస్ పహారాలో నామమాత్రంగా సభలు నిర్వహించి వచ్చేస్తున్నారు. ప్రజాగ్రహం చవిచూస్తున్న ప్రజాప్రతినిధులు టీడీపీకి మరోసారి ఓటెయ్యకుంటే కష్టాలొస్తాయంటూ ప్రజలకు పరోక్ష హెచ్చరికలు చేయడం గమనార్హం.

ప్రజాగ్రహం..

- పామర్రు నియోజకవర్గంలో జరిగిన జన్మభూమి సభల్లో సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులను నిలదీశారు. బల్లిపర్రులో పలు సమస్యలపై అధికారులకు వివరిస్తున్న స్థానికులను అడ్డుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను వివరించేందుకు కూడా తమకు హక్కు లేదా ఇదేమి గ్రామసభలంటూ స్థానికులు మండిపడ్డారు.
- కృత్తివెన్ను మండలం చినపాండ్రాక గ్రామసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడుకి స్థానిక మహిళలు చెమటలు పట్టించారు. స్థానికంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు మొరపెట్టుకున్నా ఆయన స్పందించకపోవడంతో మహిళలు తమదైన శైలిలో మంత్రి తీరును ఎండగట్టారు. ఓట్లు వేసుకొని గద్దెనెక్కి సమస్యలు పట్టించుకోరా..? మరోసారి ఓట్లు కోసం వస్తే మేమేంటో చూపిస్తామంటూ స్థానిక మహిళ చేసిన హెచ్చరిక మంత్రి సైతం అవాక్కయ్యాడు.
- కృత్తివెన్ను మండలంలో జరిగిన గ్రామసభల్లో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మరోసారి టీడీపీ ఓట్లు వేయకుంటే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే నని ప్రజలకు పరోక్ష హెచ్చరికలు చేయడం వివాదస్పదమైంది.
- తిరువూరు నియోజకవర్గంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదు. అధికార పార్టీకి చెందిన మహిళా నేతను వేదికపై ఆహ్వానించడం వివాదంగా మారింది. అధికారుల తీరును స్థానికులు ఆక్షేపించారు.
- ఉయ్యూరు మండలం కాటూరు జన్మభూమి సభలో జన్మభూమి కమిటీల పెత్తనంపై స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు నిలదీశారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అడ్డు చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం నెలకొంది.
- అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామసభలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సాగునీరు తెచ్చి పంటలు పండించామంటూ ప్రభుత్వ గొప్పలు చెబుతుంటే అదే పార్టీకి చెందిన ఓ నేత అడ్డు పడ్డారు. టీడీపీ పాలనలోనే రైతులు కూలీలుగా మారారంటూ, పండించిన పంటలకు గిట్టు బాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆ నేత నిలదీయడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు అవాక్కయ్యారు.

ఆలస్యంగా గ్రామసభలు

జన్మభూమి గ్రామసభలు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి. అధికారులు వచ్చినా ప్రజాప్రతినిధుల రాక ఆలస్యమవుతుండడంతో వారి కోసం నిరీక్షణ చేయాల్సివస్తుంది. చాలాచోట్ల విద్యార్థులనే గ్రామసభ ప్రేక్షకులుగా మార్చేస్తున్నారు. వారి చేత సాంస్కృతిక కార్యక్రమాలు చేయిస్తూ వారి చదువులకు ఆటంకం కల్గించారు.

ఆరోగ్య గ్రామాల సాధనకు కృషి

- ఈడుపుగల్లులో చెంబు నిర్యాణ ర్యాలీ
- చెంబును పాడిపై ఊరేగించిన వైనం
- హాజరైన కలెక్టరు లక్ష్మీకాంతం, ఎమ్మెల్యే బోడె ప్రసాద్



చెంబు శవయాత్రలో భాగంగా నడుస్తున్న కలెక్టరు లక్ష్మీకాంతం, ఎమ్మెల్యే ప్రసాద్, ఇతర నాయకులు

కంకిపాడు: ఆరోగ్య గ్రామాల సాధనకు కృషి చేయాలని కలెక్టరు బి.లక్ష్మీకాంతం పిలుపునిచ్చారు. ఆత్మగౌరవ దీక్షలో భాగంగా చెంబు చచ్చింది...ఆత్మగౌరవం బతికింది నినాదంతో ఈడుపుగల్లులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ దేవినేని రాజా వెంకటేశ్వర ప్రసాద్ నివాసం నుంచి చెంబు శవయాత్ర ప్రారంభించారు. చెంబులను వ్యాన్‌పై ఏర్పాటుచేసి పూలు చల్లుతూ శవయాత్ర నిర్వహించారు. శివాలయం వద్ద నుంచి కలెక్టర్ లక్ష్మీకాంతం, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు చెంబులతో కూడిన పాడిని మోస్తూ నడిచారు. శ్మశానవాటిక సమీపంలోని స్థలంలో చెంబుల ఖనన కార్యక్రమాలను పూర్తి చేయించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ గతేడాది అక్టోబరు 2న జిల్లాను ముఖ్యమంత్రి బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా ప్రకటించారన్నారు. జిల్లాలో 1.82 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్మించిన మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బహిరంగ మలవిసర్జనతో ఆరోగ్యం క్షీణించిలక్షలాది మంది చిన్నారులు మృతి చెందుతున్నారన్నారు. ఓడీఎఫ్ ప్లస్ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. చెంబును పాతటం వల్ల దురాచారాన్ని వదలటమని పేర్కొన్నారు. మరుగుదొడ్ల వినియోగంపై శ్రద్ధ చూపిన వారికి ఈనెల 11న మెగా గ్రౌండింగ్ మేళాలో ఉత్తమంగా నిలిచిన వ్యక్తులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఆర్థిక వనరులను వృద్ధి చేసుకోవడంలో అందరూ క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, డీఈవో రాజ్యలక్ష్మి, ఎంపీపీ దేవినేని రాజా వెంకటేశ్వర ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గొంది శివరామకృష్ణ ప్రసాద్, సర్పంచి షేక్ మాబు సుభాని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టీ.శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారి రమణారెడ్డి, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దార్ ఎల్లారావు, పలు శాఖల అధికారులు, స్కీమ్ వర్కర్లు, పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

మత్స్యకార హక్కుల పోరాట సమితి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విశాఖపట్నంలో తనను కలసిన మత్స్యకారులను 'తోలుతీస్తా..ఖబడ్దార్' బెదిరించిన సీఎం చంద్రబాబునాయుడు తక్షణమే మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలని మత్స్యకార హక్కుల పోరాట సమితి(ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సైకం రాజశేఖర్ డిమాండ్‌చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2013లో శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన చంద్రబాబు మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చుతానని, ఎమ్మెల్సీ కేటాయిస్తానని, మత్స్యకారుల ఉపాధిని కాపాడుతానని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు మత్స్యకారుల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. తానిచ్చిన హామీలు అమలుచేయాలని కోరితే ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి దుర్భాషలాడం, బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కుప్పం నియోజకవర్గంలో మత్స్యకారుల ఓట్లతోనే చంద్రబాబు గెలిచిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్న మత్స్యకారులను దూషించడం సరి కాదన్నారు. నాలుగేళ్ల పాలనలో మత్స్యకా రుల వృత్తిని, జీవనోపాధిని చంద్రబాబు ప్రభుత్వం ధ్వంసం చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిం చారు. మత్స్యకార సహకార సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు నడికుదిటి శివయ్య, ఓలేటి రాము, నాయుడు వెంకటేశ్వరరావు, ఒడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోకు విశేష స్పందన

- ఇళ్లు, ఇళ్ల స్థలాల వివరాలతో స్టాళ్లు ఏర్పాటు
- నేటితో ముగియనున్న ప్రదర్శన



ప్రాపర్టీ షోలో స్టాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నవ్యాంధ్ర రాజధానిలో సొంత ఇంటికలను నెరవేర్చుకోవాలనుకునే వారికి క్రెడాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీషో ఎంతో ఉపయుక్తంగా మారింది. విజయవాడ, గుంటూరులతోపాటు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల గృహసముదాయాలు, ఇండిపెంటెండ్ హౌస్‌లు, వెంచర్‌ల వివరాలతో బృందావన కాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో 5వ క్రెడాయ్ ప్రాపర్టీ షో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో ఇంటి స్థలాలపై మదుపు చేయాలనుకునే వారికోసం పలు వెంచర్లతో కూడిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రాపర్టీ షోను రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించగా, ఆదివారం సాయంత్రం ముగియనుంది. ఈ ప్రాపర్టీ షోలో సాధారణ, మధ్యతరగతి వర్గాలకు అనువైన వెంచర్‌లు, గృహాలు వివరాలతోపాటు, అత్యాధునిక సదుపాయాలతో కూడిన అత్యంత ఖరీదైన బహుళ అంతస్తుల గృహసముదాయాలు, ఇండిపెండెంట్ హౌస్‌లు నమూనాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. అంతేకాకుండా గృహ రుణాలు మంజూరు, వడ్డీరేటు, వాయిదాలు వంటి అంశాలను వివరించేందుకు బ్యాంకర్‌లు సైతం స్టాల్స్ ఏర్పాటు చేశారు. అన్ని ప్రాంతాల్లోని నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలు, రుణాలు మంజూరు చేసే సంస్థలను ఒకే వేదికమీదకు తీసుకురావడం ద్వారా సమయం వృథా కాకుండా అన్ని ప్రాంతాల్లోని సమాచారాన్ని ఒకేచోట తెలుసుకునే అవకాశం కలిగిందని పలువురు అంటున్నారు. ఈ ప్రదర్శనలో ఆధునికత ఉట్టిపడే విధంగా ఏర్పాటుచేసిన నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం సాయంత్రం వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని క్రెడాయ్ విజయవాడ చాప్టర్ అధ్యక్ష కార్యదర్శులు వైవీ రమణారావు, కె.రాజేంద్ర తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు

భవానీపురం: జిల్లాలో కొత్తగా పరిశ్రమలు స్థాపనకు ముందుకువచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, వడ్డీ, విద్యుత్, అమ్మకాలపై రాయితీలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం తెలిపారు. ఆయన తన క్యాంప్ కార్యాలయంలో శనివారం పరిశ్రమల శాఖ అధికారులతో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2017–18 ఆర్థిక సంవత్సరంలో 321 పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పడం ద్వారా 12 కోట్ల 16లక్షల విలువైన రాయితీలను మంజూరు చేశామని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు సమర్పించే దరఖాస్తులను సింగిల్ విండో విధానంలో త్వరితగతిన అనుమతులను మంజూరు చేస్తున్నామన్నారు. పారిశ్రామికపరంగా జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎ.సుధాకర్ అధికారులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్(విజయవాడ): రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై జీఆర్పీ స్టేషన్‌లో కేసు నమోదైంది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం సింగ్‌నగర్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఒక గుర్తు తెలియని మృతదేహం పడి ఉండడం గుర్తించిన ట్రాక్‌మన్ వెంటనే జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే జీఆర్పీ పోలీసులు అక్కడికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. మృతుడికి సుమారు(35) సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎత్తు 5.2 అడుగులున్నాడని సంబంధీకులు పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వై.కృష్ణారావు తెలిపారు.


మాట్లాడుతున్న రంగనాథ్


'సాక్షి' హెల్దీ కిచెన్‌కు హాజరైన మహిళలు

'సాక్షి' హెల్దీ కిచెన్.. స్పందన అదిరెన్


వంట చేస్తున్న చెఫ్ తేజ

మచిలీపట్నం టౌన్: 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్దీ కిచెన్స్ ద్వారా మహిళలు పలు వంటకాల తయారీని నేర్చుకోవడం అభినందనీయమని 'సాక్షి' యాడ్స్ డీజీఎం భట్లపెనుమర్తి రంగనాథ్ అన్నారు. మహిళలు వంటల తయారీని టీవీల్లో చూస్తూ నేర్చుకుంటున్నారని, నేరుగా వంటల తయారీ నేర్పేందుకు 'సాక్షి' ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. 'సాక్షి' మీడియా గ్రూపు – 'సాక్షి' మైత్రి మహిళ, ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని గాడల్లి కల్యాణ మండపంలో శనివారం 'సాక్షి' హెల్దీ కిచెన్స్ కార్యక్రమం నిర్వహించారు. చెఫ్ తేజ క్యారెట్ అండ్ బీట్‌రూట్ హల్వా, వెజిటబుల్ కొకెట్స్, చికెన్ ధమ్ బిర్యానీ, బోటీ కబాబ్, చికెన్ చిట్నాడు వంటి వంటకాలు తయారు చేసి చూపించారు. డీజీఎం రంగనాథ్ మాట్లాడుతూ 'సాక్షి' వార్తలపరంగా కాకుండా మహిళలకు ఉపయోగపడే పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఫ్రీడమ్ ఆయిల్ ఇంటర్నల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ గళ్లా సాయి మాట్లాడుతూ మహిళలకు ఫ్రీడమ్ ఆయిల్‌తో చేసే వంటలతో కలిగే ఉపయోగాలను తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మచిలీపట్నంలో మునుపెన్నడూ లేని విధంగా 'సాక్షి' మీడియా – రైస్‌బ్రాన్ రిఫైన్ ఆయిల్ ఆధ్వర్యంలో వంటకాల అవగాహన కార్యక్రమం నిర్వహించటం చాలా సంతోషంగా ఉందని ఫ్రీడమ్ రిఫైన్డ్ ఆయిల్ డిస్ట్రిబ్యూటర్ మాటూరి విజయభాస్కరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' యాడ్స్ డెప్యూటీ మేనేజర్ కూచిపూడి వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వి.వనితారెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

మహిళలకు బహుమతులు

మహిళలకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. ముత్యాల కోమలి, పి.సుజాత, పి.అనూష, కె.శివపార్వతి, బి.ప్రసన్న, ఎస్.నాగరాణి, ఎ.కమల, ఎం.మానసజ్యోతి, భానుపద్మజ, ఎం.రాజామణి, పి.సుధారాణి, టిప్స్‌లో జి.పద్మావతి, పి.మల్లికాంబ, ముత్యాల కోమలి, చిలంకుర్తి పద్మావతి, ప్రత్యేక బహుమతులు ఎంవీ సునీత, జె.లక్ష్మి, ఎం.ప్రసన్న, మాధురి, కె.ఉదయలక్ష్మికు బహుమతులు అందాయి.


సిద్ధం చేసిన రకరకాల నాన్‌వెజ్ వంటలు

సమత, మమత, శాంతిని కాంక్షిద్దాం

ఘనంగా సంక్రాంతి ఆత్మీయ కలయిక


జ్యోతి వెలిగించి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న అతిథులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): సమత మమత శాంతిని ప్రతి ఒక్కరూ కాంక్షించాలని సివిల్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్ అన్నారు. సమతా పార్టీ మాజీ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో సంక్రాంతి ఆత్మీయ కలయిక జరిగింది. పుష్పరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటివారికి సాయంచేసే గుణాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ఇలాంటి ఆత్మీయ కలయికల్లో పాల్గొనడం వల్ల మానసికంగా ఉత్సాహం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పరకాల ప్రభాకర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల మధ్య దూరం పెరిగిపోతున్న ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మీయ కలయికను ఏర్పాటుచేయడం అభినందించదగిన విషయమన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పండుగల సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు విరివిగా జరగాలన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు వీవీ కృష్ణారావు మాట్లాడుతూ పండుగల ప్రాధాన్యతను తెలియజేయడానికే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు, నగర ప్రముఖులు సి.రాఘవాచారి, కర్నాటి రామ్మోహనరావు, దేవినేని అవినాష్, చిట్టెయ్య, తూమాటి ప్రేమ్‌నాథ్, కాట్రగడ్డ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆడిటోరియం బయట గంగిరెద్దులతో విన్యాసాలు చేయించారు.



ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన


మార్జాలం రాచఠీవి

పెంపుడు పిల్లులతో యజమానులు



అందంగా లేనా? అసలేం బాలేనా?





'క్యాట్'వాక్


పిల్లి ఎదురొస్తే మంచిది కాదని.. అపశకునమని భావిస్తారు. కానీ, పిల్లులను కూడా కన్నపిల్లలుగా చూసుకునే వారూ ఉంటారని శనివారం నగరంలో జరిగిన క్యాట్ ఫ్యాషన్ షో నిరూపించింది. బందరురోడ్డులోని పీవీపీ మాల్‌లో జరిగిన ఈ షోలో పెంపుడు పిల్లులకు అందమైన దుస్తులు, జ్యూయలరీ అలంకరించి ఫ్యాషన్ షోకు తీసుకొచ్చారు. డీజే పెర్షియన్, మిశ్క్య, పెర్షియన్, కిత్తేన్స్, పెర్షియన్, బ్రౌనీ, టర్కిష్, స్నూఫీ, రోజీ, పారు జాతి పిల్లులతో పాటు బ్రౌన్, వైట్, బ్లాక్, క్రీమ్, మల్టీ కలర్స్ పిల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మాల్ మేనేజర్ అజయ్, నిర్మలా శ్రీనివాస్, సింధుమాధురి తదితరులు పాల్గొన్నారు.

– లబ్బీపేట (విజయవాడ తూర్పు)




పెంపుడు పిల్లలతో యజమానులు


బ్లాక్ క్యాట్.. ఫ్యాషన్ వాక్



పుస్తకం ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. పఠనం ఒక్క అంశంపై ఆసక్తిని రేకెత్తించేది కాదు. భాష ఏదైనా, ప్రస్తావన ఎక్కడైనా, అంశాలు ఎన్నైనా నిజమైన పాఠకుడు తప్పక అభిమానిస్తాడు. ఇలాంటి వారికోసం పుస్తక మహోత్సవం లో ప్రత్యేక స్టాల్స్ వెలిశాయి. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ సాహిత్యాలకు సంబంధించిన అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన గ్రంథాలు ఇక్కడ లభిస్తున్నాయి. ఎక్కడెక్కడికో వెళ్లి సాహితీ గ్రంథాలను కొనాలని భావించే ఇదొక అద్భుత అవకాశం.

- వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ)

సాహితీ వనం



నేషనల్ బుక్‌ట్రస్ట్

నేషనల్ బుక్‌ట్రస్ట్ అనేది కేంద్ర ప్రభుత్వ పబ్లిషింగ్ సంస్థ. భారత మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 1957లో స్థాపించారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ ఉత్తమ గ్రంథాలను ప్రచురిస్తూ దేశంలో సాహితీ వికాసానికి పాటుపడుతోంది. కొత్తగా అక్షరాస్యులైన వయోజనులు, పిల్లలతో సహా సమాజంలోని అన్ని వర్గాల వారికి వినోదం, విజ్ఞానం, వికాసం కలిగించే ప్రచురణలను నాణ్యతతో అందిస్తోంది. భారత సాహిత్యంలో నిర్లక్ష్యానికి గురైన పాపులర్ సైన్స్ పుస్తకాలు, సాంకేతిక పరిభాషలేని సమాచార గ్రంథాలు, పర్యావరణ విజ్ఞాన గ్రంథాలు, దేశంలోని వివిధ విషయాలకు చెందిన పుస్తకాల ప్రచురణకు ఈ సంస్థ ప్రాధాన్యతనిస్తుంది. ఎంపిక చేసిన పుస్తకాలపై 50 శాతం రాయితీ ఇస్తున్నారు. అందులో విలువైన గ్రంథాలను అందుబాటులో ఉంచారు.

తెలుగు అకాడమీ



c) System d) Source
e) Systematic

17. Within how many days the CPIO has to provide information under RTI Act?
a) 15 days b) 20 days
c) 30 days d) 45 days
e) 60 days

18. Security Paper Mill (SPM) was formally inaugurated and dedicated to the nation on the 9th March, ____ by the then Deputy



Prime Minister, Morarji Desai.
a) 1956 b) 1968
c) 1949 d) 1962
e) 1971

19. What is the full form of 'MAT'?
a) Maximum Alternate Tax
b) Minimum Alternate Tax
c) Maximum Alternate Time
d) Minimum Alternate Time
e) Minimum Applicable Tax

20. Which of the following is not a Negotiable instrument as per N.I. Act?
a) Promissory Note
b) Draft c) TDR
d) Cheque e) All the above

21. Who among the following regulates the Indian Corporate Debt Market?
a) RBI b) NABARD
c) SIDBI d) SEBI
e) PFRDA

22. "Basel Committee on Banking Supervision"s is also known as:
a) Bank for International Settlements Committee
b) Banking Regulation Committee
c) Financial Stability Board
d) Global Financial System
e) None of the above

23. Which of the following is not a negotiable instrument as per N.I.Act?
a) Promissory Note
b) Draft c) TDR
d) Cheque e) All the above

24. Which one of the following set up core banking infrastructure for rural banks?
a) IBA b) NABARD
c) RBI d) SIDBI
e) RIDF

25. What is 'fiat money'?
a) The currency backed by Government Guarantee
b) The currency backed by tangible assets
c) The currency backed by gold reserves
d) The currency backed by budgetary support
e) None of the above

26. Where is the head office of SMERA?
a) Chennai b) Gurugram
c) New Delhi d) Mumbai
e) Bengaluru

27. The Frequent changes made by Banks to their product profile is called?
a) Product Control
b) Product Enhancement
c) Product Enrichment
d) Product Marketing
e) None of the above

28. Which of the following is not correct in respect of issue of Commercial Paper?
a) It can be issued as a standalone facility
b) It can be issued for Rs. 5 lakhs and multiples of Rs. 5 lakhs
c) CPs can be underwritten by a bank
d) It can be issued for a minimum period of 7 days
e) Loan can be sanctioned against Commercial Paper

29. _____ account is opened by the investor while registering with an investment broker.
a) Fixed Deposit Account
b) Savings Bank Account
c) Recurring Account
d) Demat Account
e) None of the given options is true

30. ____ is a financial market in which share prices are rising or expected to rise.
a) Bear Market
b) Bull Market c) Pig Market
d) High Market
e) None of the above

31. Currency swap is an instrument to manage:
a) Interest Rate Risk
b) Currency Risk
c) Cash flows in different currencies
d) All of the Above
e) None of the given options is true

32. MMID (Mobile Money Identifier) consists of how many digits?
a) 5 digits b) 10 digits
c) 11 digits d) 7 digits
e) 9 digits

33. Reporting of dubious transactions has to be made to which agency?
a) FIU b) DRI c) SEBI
d) NIA e) RBI

34. Sukanya Samriddhi Account can be opened up to age of _______ years only from the date of birth.
a) 5 years b) 10 years
c) 15 years d) 20 years
e) 25 years

35. The 'Smart Vault' is an example of 'Make In India' programme as it has been designed and manufactured by Indians. In this connection a scheme in the name of Smart vault is launched by which Bank?
a) Canara bank
b) Punjab National Bank
c) ICICI Bank-Robotic locker facility
d) Dena Bank e) HSBC

36. The maximum period for which a CD(Certificate of Deposit) can be issued is:
a) 1 month b) 3 months
c) 6 months d) 9 months
e) 1 year

37. ______ Portal is a first of its kind website providing single window for students to access information and also makes application for Educational Loans provided by Banks. It also provides a link to National Scholarship Portal where in students can apply for various Government Scholarships.
a) Vidya Lakshmi
b) Vidya Saraswathi
c) Graduate Loan
d) Trun Vidya e) Prouda Vidya

38. NSDL is the first and largest depository in India, established in:
a) August 2003 b) August 1991
c) August 1989 d) August 1999
e) August 1996

39. The purpose of IRAC (Income Recognition and Asset Classification) norms is to:
a) Bind the financer to obey the guidelines of the regulator
b) Keep the financer with adequate capital
c) Make necessary provisions as applicable
d) Only a & b
e) None of the above

KEY

1) d	2) c	3) d	4) e	5) a
6) e	7) b	8) d	9) d	10) b
11) c	12) b	13) a	14) a	15) a
16) c	17) c	18) b	19) b	20) c
21) d	22) a	23) c	24) b	25) a
26) d	27) b	28) c	29) d	30) b
31) c	32) d	33) a	34) b	35) c
36) e	37) a	38) e	39) c	



కిడ్నీ కేసు కలకలంపై విజిలెన్స్ ఆరా

గుంటూరు మెడికల్ : తప్పుడు అడ్రస్ పత్రాలతో కిడ్నీ దానం చేసి ఆపరేషన్లు చేయించుకున్నట్లు ఆరోపణలు రావటంతో విజిలెన్స్ అధికారులు ఈ కేసుపై ఆరా తీశారు. గుంటూరు జీజీహెచ్ అధికారులను శనివారం కలిసి ఆస్పత్రిలో ఎన్ని కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు అనుమతులు ఇచ్చారు, ఎన్ని ఆస్పత్రుల్లో ఎన్ని ఆపరేషన్లు జరిగాయి, వారికి కిడ్నీ దాతలు ఇచ్చిన అడ్రస్ పత్రాలన్నీ అందజేయాలని కోరారు. రెండు రోజుల్లో వివరాలను అందజేస్తామని ఆస్పత్రి అధికారులు వారికి తెలిపారు. గుంటూరు వేదాంత హాస్పటల్స్‌లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు చిగురుపాటి శివనాగేశ్వరరావు కిడ్నీ దాతల వివరాలు తప్పుడువి అందజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలి కిడ్నీ దాత అడ్రస్ ప్రూఫ్‌లు తప్పుడివి ఇవ్వటంతో అతడిపై నరసరావుపేటలో కేసు నమోదు అయ్యింది. దీంతో రెండో దాత గోపీని సిద్ధం చేసుకుని అతడి అడ్రస్ ఆధారాలు సైతం తప్పుడువి ఇచ్చినట్లు వెలుగులోకి వచ్చింది. శనివారం 'సాక్షి'లో ఈ విషయంపై కథనం ప్రచురితం అవ్వటంతో విజిలెన్స్ అధికారులు తమకు పూర్తి వివరాలు అందజేయాలని ఆస్పత్రి అధికారులను కోరారు. కాగా కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే శివనాగేశ్వరరావుకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు అనుమతులు ఇచ్చిన జీజీహెచ్ అధికారులపై సైతం ఆరోపణలు వస్తున్నాయి. విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలి

మత్స్యకార సంఘ నాయకుల డిమాండ్

తాడేపల్లి రూరల్ (మంగళగిరి) : తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం పడవలరేవులో మత్స్యకార హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫిషర్‌మెన్ సొసైటీ కార్యదర్శి నడకుదిటి శివయ్య, అగ్నికుల క్షత్రియ ఐక్యవేదిక కన్వీనర్ ఓలేటి రాములు మాట్లాడుతూ 2013 ఎన్నికల పర్యటనలో భాగంగా మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని, ఎమ్మెల్సీ కేటాయిస్తామని, ఉపాధిని కాపాడతానని చెప్పి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికి వదిలేశారన్నారు. ఎస్టీలో చేర్చే అంశంపై విశాఖపట్నంలో చంద్రబాబునాయుడును కలిసిన మత్స్యకారులపై విరుచుకుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులను రకరకాలుగా దూషిస్తూ, బెదిరించడం అంటే వృత్తిని, మత్స్యకారులను దూషించడమేనని అన్నారు. తక్షణమే మత్స్యకారులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మత్స్యకార హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సైకం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో కరువుకాటకాలకు చెక్

వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్‌పాలేకర్



ఏఎన్‌యూ : ప్రకృతి వ్యవసాయం ద్వారా సేద్యం చేసే పంటలు కరువుకాటకాలను తట్టుకుంటాయని, ఇతర వ్యవసాయ పద్ధతుల కంటే ఇది ఎంతో అత్యుత్తమ విధానమని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్‌పాలేకర్ అన్నారు. ఏపీ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో ప్రకృతి వ్యవసాయంపై జరుగుతున్న శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం పాలేకర్ పలు అంశాలపై రైతులకు అవగాహన, శిక్షణ కల్పించారు. రసాయనిక పద్ధతిలో వ్యవసాయం చేస్తే తోటలు కరువుకాటకాలను తట్టుకోలేక నశించిపోతాయని చెప్పారు. ఖర్చు తక్కువతో కూడిన ప్రకృతి వ్యవసాయం చేస్తే అన్ని పరిస్థితులను పంటలు తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. అతి వర్షాభావాన్ని, బెట్టను కూడా తట్టుకోగలవని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మొక్కల్లో ఉండే పోషకాలు, మొక్కల ఆకులు వర్షాన్ని తట్టుకుని ఉండ గలిగే శక్తినిస్తాయన్నారు. అన్ని పరిస్థితులను తట్టుకునే శక్తి మొక్కలకు ఆవుపేడ ద్వారా లభిస్తుందని తెలిపారు. ఇతర పద్ధతుల్లో వ్యవసాయం చేసే మొక్కలకు 10 శాతం కరువు, కాటకాలను తట్టుకునే శక్తి ఉంటే ప్రకృతి వ్యవసాయంలో 90 శాతం శక్తి ఉంటుందన్నారు. ఆఫ్రికన్ దేశాలతో పోలిస్తే మన దేశంలోనే నేల క్రమక్రమంగా ఎడారిగా మారుతోందన్నారు. రసాయన, సేంద్రియ వ్యవసాయాల వల్ల మనం సారవంతమైన నేలలను ఎడారిగా మార్చుకుంటున్నామని తెలిపారు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ప్రకృతి వ్యవసాయమే మార్గమని చెప్పారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..

ఎన్నాళ్లో వేచిన ఉదయం ఈరోజు ఎదురవనుంది. సిద్ధార్థ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరుగనుంది. కళాశాల ఏర్పాటైన 1981–82 బ్యాచ్ నుంచి తాజాగా బయటకు వెళ్లిన 2016–17 బ్యాచ్ వరకు అందరూ హాజరు కావాలని పూర్వ విద్యార్థుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యను నేర్పిన గురువులను సత్కరించనున్నారు.

- నేడు సిద్ధార్థ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- విద్య నేర్పిన గురువులను సత్కరించనున్న విద్యార్థులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు) :

సిద్ధార్థ వైద్య కళాశాల ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 30 బ్యాచ్‌లు బయటకు వెళ్లగా, వారిలో 300 మందికి పైగా విద్యార్థులు ఆదివారం నాటి సమావేశానికి హాజరుకానున్నారు. నగరంతో పాటు, దేశ విదేశాల్లో స్థిరపడిన వారు వస్తున్నారని అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ అమ్మన, డాక్టర్ వీఎస్ వరప్రసాద్ తెలిపారు. తమ గురువులకు సత్కారం చేయడంతో పాటు, వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకునేలా నిర్ణయం తీసుకోనున్నామని వివరించారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావుతో పాటు, వైద్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొననున్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

సిద్ధార్థ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే వైద్య విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. అలాగే, బాయ్స్ హాస్టల్‌లో రీడింగ్ రూం, లేడీస్ హాస్టల్‌లో డైనింగ్ రూం, వెయిటింగ్ రూం వంటి సౌకర్యాలు కల్పించారు. అంతేకాకుండా అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తూ మందులను సైతం అందిస్తున్నారు.

ఘనంగా గెట్ టు గెదర్

హోటల్ తాజ్ గేట్‌వేలో శనివారం రాత్రి కళాశాల పూర్వ విద్యార్థుల గెట్ టు గెదర్ జరిగింది. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ ప్రతినిధులతో పాటు, పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల గురించి చర్చించారు.



సిద్ధార్థ వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీ

శ్రమిస్తే విజయం తథ్యం

- ఒలింపిక్ పతక విజేత కరణం మల్లేశ్వరి
- ముగిసిన విజ్ఞాన్ మహోత్సవ్

చేబ్రోలు (పొన్నూరు) : విద్యార్థులు ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తే కచ్చితంగా విజయం సాధించవచ్చునని ఒలింపిక్ పతక విజేత, ప్రముఖ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన రెండు రోజుల విజ్ఞాన్ మహోత్సవ్–2018 ముగింపు వేడుకల్లో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. మల్లేశ్వరి మాట్లాడుతూ మన జీవితంలో ప్రతి రోజూ ముఖ్యమేనని, సమయాన్ని వృథా చేయరాదన్నారు. ప్రతివారిలోనూ ఏకాగ్రత, నిరంతర సాధన, క్రమశిక్షణ, పెద్దలంటే గౌరవం, పట్టుదల, లక్ష్యంపై దృష్టి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక అంతర్గత శక్తి ఉంటుందని, దాన్ని గుర్తించి సాధన చేస్తే తప్పకుండా విజయం సాధించవచ్చని తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మహిళలు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో ఏకంగా 21 మహిళా జట్లు పాల్గొనడం హర్షణీయమన్నారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న విద్యార్థినులు

వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలతో పాటు రూ.25 లక్షలకుపైగా విలువైన నగదు బహుమతులను అతిథులు అందజేశారు. విజ్ఞాన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఆచార్య కె.రామ్మూర్తినాయుడు, వీసీ ఎంవైఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, మహోత్సవ్ కన్వీనర్, డీన్ ఆర్‌అండ్‌డీ డాక్టర్ విధు కాంప్రుత్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ పోటీల విజేతలు

టెన్నికాయిట్ : 1.ఎంఐసీ కళాశాల, 2.విజ్ఞాన్ యూనివర్సిటీ. వాలీబాల్ (పురుషులు) : 1. సెయింట్ ఆన్స్, 2. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ. వాలీబాల్ (మహిళలు) : 1. జీఎన్‌ఐటీఎస్, 2. విజ్ఞాన్ యూనివర్సిటీ. త్రోబాల్ : 1. జీఎన్‌ఐటీఎస్, 2. విజ్ఞాన్ యూనివర్సిటీ. బాస్కెట్ బాల్ : 1. ఎంఎల్‌ఆర్‌ఐటీ, 2. విజ్ఞాన్ యూనివర్సిటీ. కబడ్డీ : 1. కేఎల్‌యూ, 2. పీవైడీఏహెచ్ ఇంజినీరింగ్ కళాశాల. ఫుట్‌బాల్‌లో సూడాన్ దేశానికి చెందిన విజ్ఞాన్ విద్యార్థులు, విజయవాడ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.



కరణం మల్లేశ్వరిని సన్మానిస్తున్న అతిథులు



విద్యార్థుల కబడ్డీ పోటీ

పోలవరంపై బీజేపీ, టీడీపీలకు చిత్తశుద్ధి లేదు

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

గన్నవరం : పోలవరం నిర్మాణం విషయంలో బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. ధవళేశ్వరం నుంచి పోలవరం వరకు ఈ నెల 7 నుంచి చేపట్టే పాదయాత్రలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన మార్గమధ్యంలో గన్నవరంలో ఆగారు. స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లోని ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 13 జిల్లాలకు సాగు, తాగునీటిని అందించాల్సిన ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలన్న ఆలోచన కేంద్రానికి గానీ, రాష్ట్రానికిగానీ లేకపోవడం బాధాకరమన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు తోడుదొంగలుగా మారి పోలవరాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తూ లేనిపోని కుంటిసాకులు చెబుతోందని మండిపడ్డారు. 2019 నాటికి కూడా ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదని, ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, డీసీసీ అధ్యక్షుడు ధనేకుల మురళీమోహన్, నున్న సర్పంచి విజయకుమార్, పార్టీ నాయకులు కొమ్మినేని మల్లికార్జునరావు, చలమలశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాన్నా, చెప్పవా

రోబోకి ఆ పేరు ఎలా వచ్చింది?




రోబో పేరు దేశమంతా మారుమోగిపోతోంది. ఎందుకో మనందరికీ ఇప్పటికే తెలిసే ఉంటుంది. సినిమా సంగతి పక్కనబెడితే, రోబో అంటే ఎలక్ట్రానిక్ ప్రోగ్రామింగ్ ద్వారా పనిచేసే మర మనిషి. 1948లో మొట్టమొదటి ఎలక్ట్రానిక్ రోబోట్‌ని ఇంగ్లండ్‌లోని బ్రిస్టల్‌లో విలియం గ్రే వాల్టర్ రూపొందించారు. 1954లో జార్జి డెవోల్ మొదటి డిజిటల్, ప్రోగ్రామబుల్ రోబోని తయారు చేసి జనరల్ మోటార్స్ అనే కంపెనీకి 1960లో విక్రయించారు. ఆ కంపెనీ వారు వేడివేడి లోహాల ముక్కలను పైకి లేపటానికి వీటిని ఉపయోగించేవారు. ఆ తరవాత రోబోని అణు కార్యక్రమాల్లో శాస్త్రవిజ్ఞాన పరిశోధనల్లో ఉపయోగించేవారు.

రోబో అనే పేరు చెకొస్లవేకియా వారి భాషలోని రోబోటా అనే పదం నుంచి వచ్చింది. చెక్ భాషలో తప్పని సరి కార్మికుడు అని అర్థం. ఈ రోబోలను అణుధార్మిక సంబంధిత పనుల లోని సున్నితమైన దశల్లో ఉపయోగించేవారు. మనిషికి ప్రమాదం కలిగించే పదార్థాలతో పనిచేయటానికి ఈ రోబో ఉపయోగపడుతుందని భావించేవారు. అయితే ప్రస్తుతం అభివృద్ధి చెందిన దేశాల్లో సాధారణ పనులకు కూడా రోబోలపై ఆధారపడుతున్నారు. జపాన్‌లో రోబోలతో ఇంటికి సంబంధించిన అనేక రకాల పనులు కూడా చేయిస్తున్నారు.

రంగులు వేయండి



పైన ఉన్న రెండు బొమ్మల మధ్య 5 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.




కింద పజిల్ పక్కన ఇచ్చిన పదాలు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

Science Fiction/Fantasy

U	Y	G	O	L	O	N	H	C	E	T	H	S	H
Y	O	U	T	E	R	S	P	A	C	E	E	O	R
S	M	A	G	I	C	C	R	E	H	H	R	S	E
U	F	F	V	I	L	L	A	I	N	L	O	L	T
P	U	A	L	P	R	I	N	C	E	S	S	S	T
E	T	N	C	E	R	U	T	N	E	V	D	A	O
R	U	T	L	S	N	A	A	L	I	E	N	A	P
N	R	A	I	E	L	O	C	A	S	T	L	E	Y
A	I	S	F	O	R	E	S	T	H	A	N	T	R
T	S	Y	H	F	C	E	W	P	A	V	U	Y	R
U	T	I	V	I	P	T	I	I	T	R	U	C	A
R	I	W	F	O	A	T	A	E	S	D	A	O	H
A	C	V	A	E	L	Z	Z	I	R	F	S	M	O
L	F	V	R	A	R	O	A	L	D	D	A	H	L


MAGIC
C.S. LEWIS
PRINCESS
HARRY POTTER
ADVENTURE
FANTASY
SUPERNATURAL
FUTURISTIC
HERO
ROALD DAHL
FOREST
MS FRIZZLE
CASTLE
OUTER SPACE
ALIEN
VILLAIN
TECHNOLOGY

పూరించండి



పైన కొన్ని బాక్స్‌లు, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లీషు పేరును మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లిష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున ఖాళీ గళ్లలో బొమ్మ గీయండి





సింహం గళ్లపై నుండి నడుచుకుంటూ పైకి వెళ్లి బాల్ తీసుకోవాలి. X మార్క్‌ను దాటుకుంటూ వెళ్లకూడదు.

జవాబు – Snowfall

సాగరతీరంలో తాబేళ్ల సంరక్షణకు చర్యలు

- పాలకాయతిప్ప బీచ్‌లో హేచరీ ఏర్పాటు
- ఐదు నెలలపాటు తాబేళ్ల పునరోత్పత్తికి చర్యలు
- నాడు 'సాక్షి'లో కథనం

కోడూరు(అవనిగడ్డ):

హంసలదీవిలోని పవిత్ర కృష్ణా సాగర సంగమం ప్రాంతంలో తాబేళ్ల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తీరంలో అరుదైన అలీవ్ రిడ్లే జాతి తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయంటూ డిసెంబర్ 18వ తేదీన 'ప్రమాదంలో అలీవ్ రిడ్లే' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జిల్లా అటవీ అధికారులు మునుపెన్నడూ లేనివిధంగా పాలకాయతిప్ప బీచ్‌లో తాబేళ్ల సంరక్షణ కోసం ప్రత్యేక హేచరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.



హేచరీని ప్రారంభిస్తున్న అటవీ అధికారులు

ఇందులో భాగంగా శనివారం బీచ్ వద్ద తాబేళ్ల గుడ్లను భద్రపర్చేందుకు వెదురు కర్రలతో చతురస్త్రాకారంలో పటిష్టమైన నిర్మాణం చేశారు. తాబేళ్ల గుడ్లను సేకరించి వీటిల్లో పునరోత్పత్తికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఫారెస్ట్ అధికారి వి.సాయిబాబు చెప్పారు. తాబేళ్లు తీరం వెంట ఎంత ఉష్ణోగ్రతలో గుడ్లు పెడుతున్నాయో, అదే లోతును హేచరీలో తవ్వి గుడ్లను ఉత్పత్తి కోసం ఉంచనున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి మే నెల వరకు ఐదు నెలలపాటు ఈ పునరోత్పత్తి కేంద్రాన్ని కొనసాగించి, స్థానికుల ద్వారా తాబేళ్లను సంరక్షిస్తామని సాయిబాబు చెప్పారు.

సముద్రంలో వేటకు వెళ్లే ప్రతి పడవ కింద ప్యాన్ రెక్కలు తగలకుండా ట్రాక్నట్స్‌ను ఏర్పాటు చేయాలని మత్స్యకారులకు సూచించారు. హేచరీ నిర్వహించే వారి కోసం ప్రత్యేక షెడ్లును కూడా నిర్మించారు. కైకలూరు డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరరావు, అవనిగడ్డ రేంజ్ అధికారి వి.భవానీ, సెక్షన్ ఆఫీసర్ ఖాదర్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

కంకిపాడు: అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ టీ. శ్రీనివాసరావు హెచ్చరించారు. కంకిపాడు, పునాదిపాడు గ్రామాల్లోని పలు రేషన్ దుకాణాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్, వాస్తవ స్టాకు వివరాలు తనిఖీ చేశారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 'నల్లబజారులోకి రేషన్ బియ్యం' శీర్షిక సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించి తాము దుకాణాల తనిఖీలు చేపట్టామన్నారు. రేషన్ షాపులపై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా కూడా నేరమేనన్నారు. శాఖాపరమైన చర్యలు చేపడతామని స్పష్టంచేశారు.


కార్డుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పౌరసరఫరాల శాఖ డీటీ టీ. శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్..

9న ట్రిపుల్ ఐటీలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నూజివీడు : ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల నేపథ్యంలో ఈనెల 9న పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఓ శ్రీహరి తెలిపారు. 'భారతదేశ ప్రజాస్వామ్యంలో యువత పాత్ర' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రిపుల్ ఐటీలోని ఏ4 బ్లాక్‌లో ఉదయం 10 నుంచి 11గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని శ్రీహరి విజ్ఞప్తిచేశారు.

ఐజీఎంసీ స్టేడియంలో ఐటా మెన్స్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శనివారం పురుషుల ఐటా టెన్నిస్ టోర్నీ ప్రారంభమైంది. తొలి రోజు క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. విజేలతకు రూ.లక్ష ప్రైజ్‌మనీని అందజేయనున్నారు. మెయిన్ డ్రా మ్యాచ్‌లు సోమవారం నుంచి జరుగనున్నాయి.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

సాక్షి,విజయవాడ : కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా సంఘ అధ్యక్షుడుగా తోకల రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడుగా పాలంకి నాగరాజు, ఉపాధ్యక్షులుగా జి.ఉమారాణి, డి.శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా బీరం వెంకట రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ప్రతాప్, ఎస్‌కె రహీం, సంయుక్త కార్యదర్శిగా కె.వి.సుబ్రహ్మణేశ్వరరావు, కోశాధికారిగా కనక దుర్గారావు, సభ్యులుగా గురజాడ బాబూరావు, ఆవుల ప్రసన్నకుమారి, గౌరవ సలహాదారుగా ఎంవీడీటీ నగేష్ ఎన్నికయ్యారు.

బీజేపీ మజ్దూర్ మోర్చా జిల్లా సమావేశం నేడు

నూజివీడు : బీజేపీ మజ్దూర్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం మచిలీపట్నంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మజ్దూర్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తూరి వెంకటసుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శులు అరుణ, అంజిబాబు తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశానికి జిల్లా పదాధికారులు, కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని విజ్ఞప్తిచేశారు.

సాగరసంగమం అభివృద్ధికి అటవీశాఖ అడ్డుకాదు

- తీరంలో జీవజాతులపై ప్రదర్శనశాల ఏర్పాటుకు సన్నాహాలు
- జిల్లా ఫారెస్టు అధికారి సాయిబాబు

కోడూరు(అవనిగడ్డ): హంసలదీవిలోని కృష్ణాసాగరసంగమ ప్రాంతం వన్యప్రాణుల అభ్యయాణ్యం పరిధిలోకి వచ్చినా తీరంలో పర్యాటకుల కోసం చేసే అభివృద్ధి పనులకు అటవీశాఖ అడ్డుకాదని జిల్లా ఫారెస్టు అధికారి వి.సాయిబాబు స్పష్టం చేశారు. శనివారం స్థానిక అధికారులతో కలిసి పాలకాయతిప్ప సముద్రతీరంలో పర్యటించారు. 1988 ఫారెస్టు పాలసీ ప్రకారం చట్టాలకు తగ్గట్టుగా 33శాతం అటవీ సంపద ఉండాలనే నిబంధన ఉందని, అయినా పర్యాటక, రెవెన్యూ అధికారులు తీరంలో పర్యాటకుల వసతి కోసం అభివృద్ధి పనులు చేస్తామని దరఖాస్తు చేసుకొంటే, ఉన్నతాధికారులు వాటిని పరిశీలిస్తారని సాయిబాబు చెప్పారు. ప్రస్తుతం అటవీశాఖ ఆధ్వర్యంలో డాల్ఫిన్ భవనం వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కూడా కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకుల కోసం సముద్ర శింకు వద్ద నుంచి సంగమం వరకు బోటింగ్ కోసం ప్రయత్నాలు చేయడంతోపాటు తీరంలో జీవజాతులను వివరిస్తూ ప్రదర్శనశాలను కూడా నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. అక్కడ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించి, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా స్థానికులను కూడా భాగస్వాములను చేయనున్నట్లు సాయిబాబు చెప్పారు. కైకలూరు డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరరావు, అవనిగడ్డ రేంజ్ అధికారి వి.భవానీ, సెక్షన్ ఆఫీసర్ ఖాదర్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కార్యక్రమంపై గంటగంటకు సమీక్ష

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీకాంతం

చిలకలపూడి(మచిలీపట్నం): జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలు రియల్ టైమ్ గవర్నెస్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసే విషయంపై గంటకు గంటకు సమీక్షిస్తానని కలెక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. శనివారం కలెక్టర్ బంగ్లా నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జన్మభూమి అర్జీలు ఇప్పటివరకు 67వేలు వచ్చాయన్నారు. మీకోసం వెబ్‌సైట్‌లో 47వేలు అప్‌లోడ్ చేసినప్పటికీ, రియల్ టైమ్ గవర్నెస్ వెబ్‌సైట్‌లో కేవలం 16 వేలు అప్‌లోడ్ చేయడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. విజయవాడ కార్పొరేషన్‌కు సంబంధించి 7వేల అర్జీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందని, దీనిని వెంటనే చేయాలని అధికారులకు సూచించారు. నిర్ణీత సమయంలో అప్‌లోడ్ చేయని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో బీఆర్ అంబేద్కర్, ఆర్డీవో జె.ఉదయ భాస్కరరావు, సీపీవో జగన్మోహనరావు, మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

ముస్లింలకు సబ్‌ప్లాన్ హర్షణీయం

ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో భాగంగా తాము అధికారంలోకి వస్తే ముస్లింలకు సబ్‌ప్లాన్ ప్రకటిస్తామని పేర్కొనడం హర్షనీయమని ముస్లిం సంక్షేమ సమతి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ పేర్కొన్నారు. ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు ఇస్తామని పేర్కొనడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముస్లిం సంక్షేమానికి కృషి చేసేందుకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని హామీ అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ముస్లింల అభివృద్ధికి ఆలోచించే వారికి ఎప్పుడు తమ మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


ముక్తార్ అలీ

10న భూసేకరణ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర ససద్సు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): భూసేకరణ చట్టం–2013ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన బిల్లును వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 10న రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెవీవీ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సులో ఏఐకేఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్, వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా భూసేకరణ చట్టం –2013కు సరవణలు చేసిందన్నారు, బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకుండా ఒత్తిడి తెచ్చేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం



లబ్బీపేట: న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ ఫ్రెండ్షిప్ సొసైటీ వారి నుంచి జాతీయ ఉత్తమ క్రాఫ్ట్ టీచర్ అవార్డును అందుకున్న కరోది విజయలక్ష్మిని శనివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సత్కరించారు. వన్‌టౌన్‌లోని జయకిసాన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 30 సంవత్సరాలుగా క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి ఇటీవల జాతీయ అవార్డు అందుకున్నారు. నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆమె ను జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీను, జీవీఎస్ పెరుమాళ్లు మాట్లాడుతూ విజయలక్ష్మి తయారు చేసిన అనేక వస్తువులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎ.సత్యనారాయణరెడ్డి, నగర శాఖ నాయకులు ఎ. శ్రీనివాసరావు, ఇ.వెంకటరెడ్డి, సునాథ్, వెంకటరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన భక్తుడు విరాళం శనివారం అందచేశారు. గొల్లపూడికి చెందిన డీఎస్ఆర్ ఆంజనేయశర్మ శనివారం ఆలయ అధికారులను కలుసుకుని రూ. 1,01,116 విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలిచ్చారు.

పండగొచ్చింది.. లక్షాధికారులను చేసింది

- విలక్షణంగా సాగిన 'సాక్షి' పండుగ సంబరాలు
- పద్నాలుగో డ్రా విజేత దారాస్ కస్టమర్
- ఏలూరురోడ్డులోని దారాస్‌లో డ్రా నిర్వహణ
- డ్రా తీసి విజేతను ప్రకటించిన పదమూడో డ్రా విజేత
- ముగిసిన పండుగ సంబరాలు, నేడు చివరి డ్రా
- ప్రధాన స్పాన్సర్‌గా సోనోవిజన్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): పదిహేను రోజుల పాటు విలక్షణంగా, ఉత్సాహంగా సాగిన సాక్షి పండుగ సంబరాలు శనివారంతో ముగిశాయి. కొనుగోలుదారులను లక్షాధికారులను చేసి వారి కుటుంబాల్లో నిజమైన ఆనందాన్ని 'సాక్షి పండుగ' సంబరాలు నింపింది. కస్టమర్ల నుంచి అనూహ్య స్పందన లభించగా నగరంలోని పలు షోరూమ్‌లలో కొనుగోళ్లు జరిపిన సామాన్యులు సైతం లక్షాధికారిగా ఎంపికయ్యారు. కార్యక్రమాల్లో భాగస్వాములైన షోరూమ్‌లలో సైతం సేల్స్ పెరిగాయని నిర్వాహకులు తెలిపారు. సంబరాల్లో భాగంగా 14వ డ్రా శనివారం ఏలూరు రోడ్డులోని దారాస్ షోరూంలో జరిగింది. పదమూడో డ్రా విజేత యం సాయి లక్ష్మి డ్రా తీసి బంపర్ ప్రైజ్ విజేతను ఎంపిక చేశారు. ఈ డ్రాలో దారాస్ కస్టమర్ కె. మాధవి విజేతగా నిలిచి లక్ష రూపాయల నగదు బహుమతిని గెలుచుకున్నారు. అనంతరం దారాస్ సిబ్బందితో పాటు, పలువురు కస్టమర్లు డ్రాతీసి ఐదుగురిని కన్సోలేషన్ బహుమతులకు ఎంపిక చేశారు. పండుగ సంబరాలు చివరి డ్రా ఆదివారం ఏలూరురోడ్డులోని బిగ్ సీ షోరూంలో నిర్వహించనున్నారు. 'సాక్షి' డీజీఎం(యాడ్స్) బి. రంగనాథ్, యాడ్స్ మేనేజర్లు జేఎస్ ప్రసాద్, ఎం. రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



దారాస్ షోరూంలో డ్రా తీస్తున్న 13వ డ్రా విజేత సాయిలక్ష్మి

'పండుగ సంబరాలకు స్పాన్సర్స్

'సాక్షి' పండుగ సంబరాల్లో ప్రధాన స్పాన్సర్‌గా సోనోవిజన్ వ్యవహరిస్తుండగా, సపోర్టెడ్ బైగా కళానికేతన్, పవర్డ్ బైగా బిగ్ సీ మొబైల్స్ వారు వ్యవహరిస్తున్నారు. కో స్పాన్సర్స్‌గా రాధామాధవ్ టయోటా, ధారాస్, రాపోర్టు షూ కంపెనీ, మారుతీ సుజికీకి చెందిన మిత్రా ఆటో ఏజెన్సీస్ , వరుణ్ మోటార్స్, సంతోష్ మోటార్స్‌లు వ్యవహరిస్తున్నారు. గిఫ్ట్ స్పాన్సర్స్‌గా ట్విల్స్, దుర్గా మెగా ఫర్నిచర్ మార్ట్, నిత్యం వంటనూనెలు, సెల్‌కాన్ మొబైల్స్, వైట్‌హౌస్‌లు ఉన్నాయి. కాగా టీవీ పార్టనర్‌గా 'సాక్షి' టీవీ, రేడియో పార్టనర్‌గా రెడ్‌ఎఫ్‌ఎం వారు వ్యవహరిస్తున్నారు.

పద్నాలుగో డ్రా విజేతలు వీరే..

ఏలూరురోడ్డులోని దారాస్ షోరూంలో నిర్వహించిన 14వ డ్రాలో బంపర్ బహుమతి విజేతగా దారాస్ కస్టమర్ కె. మాధవి నిలిచి రూ. లక్ష నగదు బహుమతి గెలుచుకున్నారు. మొదటి కన్సోలేషన్‌ను వరుణ్‌మోటార్స్ కస్టమర్ ఎ.సురేష్, రెండో కన్సోలేషన్‌ను దారాస్ మొబైల్స్ కస్టమర్ ఎ. రాఘవ, మూడో కన్సోలేషన్‌ను అదే షోరూం కస్టమర్ కేఎస్ గంగేష్, నాలుగో కన్సోలేషన్‌ను బిగ్‌సీ కస్టమర్ ఎ. మోహనరావు, ఐదో కన్సోలేషన్‌ను దారాస్ కస్టమర్ జి. చంద్రకాంత్ గెలుపొందారు.

వర్ణించలేని ఆనందం



నేను నూజివీడులోని ఐఐఐటీలో చదువుతున్నా. మా ఇంట్లోకి రిఫ్రిజిరేటర్‌ను గుడివాడలోని సోనోవిజన్‌లో కొనుగోలు చేశారు. నాపేరుతో కొనుగోలు చేయాలని తొలుత నిర్ణయించారు. షోరూంలో బిల్లు చెల్లించినప్పుడు 'సాక్షి' పండుగ కూపన్‌లు ఇచ్చారు. వాటిని పూర్తి చేసి బాక్స్‌లో వేశామే కానీ బహుమతి వస్తుందని అస్సలు ఊహించలేదు. ఇప్పుడు రూ.లక్ష గెలుపొందడం చాలా సంతోషంగా ఉంది. మరలా ఇప్పుడు మరో విజేతను నేను ఎంపిక చేయడం అంటే ఊహించలేనంత ఆనందంగా ఉంది.

– ఎం.సాయిలక్ష్మి, 13వ డ్రా విజేత

మేము భాగస్వాములవడం సంతోషంగా ఉంది



పండుగల సీజన్‌లో 'సాక్షి' పండుగ సంబరాలు కస్టమర్స్‌లో ఎంతో ఉత్సాహాన్ని నింపాయి. ప్రతిరోజు ఒక షోరూంలో డ్రా తీస్తూ విజేతలను ఎంపిక చేసిన విధానం చాలా పారదర్శకంగా ఉంది. ఎంతోమంది సామాన్య కస్టమర్లు బంపర్ ప్రైజ్ బహుమతులు గెలుపొందారు. మేము కూడా ఇలాంటి మంచి కార్యక్రమంలో భాగస్వాములయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ రోజు తమ కస్టమర్ రూ. లక్ష గెలుచుకోవడం ఆనందాన్నిచ్చింది. ఇలాంటి కార్యక్రమాలు 'సాక్షి' మరిన్ని చేపట్టాలి.

– దారా చంద్రగుప్త, దారాస్ అధినేత

బందరు పోర్టు పేరుతో భూదోపిడీ

మాజీ మంత్రి వడ్డే



ఉయ్యూరు (పెనమలూరు): పోర్టు నిర్మాణం పేరుతో భూదోపిడీ ఆపాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచించారు. ఉయ్యూరులోని తన నివాసంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో బందరు పోర్టు పనులు ప్రారంభిస్తామని గొప్పలు చెప్పి నాలుగేళ్లు అవుతున్నా ఏ ఒక్క పనీ ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. పోర్టుకు 5200 ఎకరాలు అవసరం లేదని, 1200 ఎకరాల్లోపు భూమి సరిపోతుందని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక పోర్టుకు వేలాది ఎకరాలు ఎందుకు భూసేకరణ జరుపుతున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పోర్టు ఆధారిత పరిశ్రమల పేరుతో 27 వేల ఎకరాల భూములను సేకరించాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. ఏ ఒక్క భారీ పరిశ్రమ ఏర్పాటుకు నిర్దిష్ట ప్రతిపాదన ఏదీ లేనప్పుడు వేలాది ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. మేజర్ పోర్టు నిర్మింపచేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం క్షమించరానిదన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా చంద్రబాబు వ్యవహరించడం ప్రజాద్రోహమవుతుందని తేల్చిచెప్పారు. బందరు పోర్టుకు రెండు వేల ఎకరాల భూమి సరిపోతుందన్నారు. విభజన హామీలను అమలు చేయాలని టీడీపీ ఎంపీలు ప్రధానిని కలిసి ఏం సాధించారని ప్రశ్నించారు. దుగరాజపట్నం పోర్టు సాంకేతికంగా అనువుకాదని నిపుణుల కమిటీ స్పష్టం చేసిందన్నారు. తన శ్వాస ఉన్నంత వరకు రైతు పరిరక్షణ కోసం పాటుపడతానని స్పష్టంచేశారు. ఈ నెల 8న బందరులో జరిగే సమావేశంలోనూ తన వాణి వినిపిస్తానని తెలిపారు.

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం

పటమట (విజయవాడ తూర్పు):

కల్యాణరాముడైన శ్రీనివాసుడికి శనివారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈ వేడుకను భక్తులు కనులారా తిలకించి పులకించి తరించారు. నిత్య కల్యాణమూర్తి, నిత్యోత్సవ చక్రవర్తిని 25 రకాలతో కూడిన ఎనిమిది టన్నుల పుష్పాలతో అర్చించారు. పటమట రైతు బజారు ఎదురుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శ్రీ లక్ష్మీ శ్రీనివాస వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి నిత్యోత్సవంలో భాగంగా ఏడోరోజు శ్రీవారికి పుష్పయాగం నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామిని వివిధ రకాల పుష్పాలతో అభిషేకిస్తూ పరమానందభరితులయ్యారు. సుగంద పరిమళాలను వెదజల్లే పుష్పలతో శ్రీవారిని శ్రీదేవి భూదేవి సమేతంగా అభిషేకించారు. అనంతరం విష్ణు గాయత్రి మహామంత్రంలో బిళ్వదళాలతో 108 పర్యాయాలు హోమం జరిపారు.



పుష్పయాగానికి సిద్ధమైన శ్రీనివాసుడు



వివిధ రకాల పూలతో తరలివచ్చిన భక్తులు

పుష్పాలతో శోభాయాత్ర

గురునానక్ కాలనీ నుంచి మంగళవాయిద్యాలతో శాస్త్ర బద్ధంగా 8 టన్నుల పుష్పాలను బుట్టల్లో ధరించి వేయిమంది మహిళలు శోభాయాత్రగా శ్రీవారి నిత్యోత్సవాల వేదిక వద్దకు తరలివచ్చారు. శ్రీవారి కల్యాణం అనంతరం అర్చకులు, వేద పండితులు మహా పుర్ణహుతి నిర్వహించారు. 18 రకాల ద్రవ్యాలను అగ్నికి ఆహుతిచ్చి హోమ ఫలితాన్ని వేంకటేశ్వర స్వామికి సమర్పించారు.

నేడూ శ్రీవారి దర్శనం

శ్రీవారి నిత్యోత్సవాలను భక్తుల కోరిక మేరకు ఆదివారం వరకు పొడిగించినట్లు నిర్వాహకులు తెలిపారు. సెలవురోజు కావడంతో అధికమంది భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా యథావిధిగా పూజలు జరిపిస్తామని నిర్వాహకుడు గరిమెళ్ల నాని తెలిపారు. స్వామి వారి కల్యాణంలో దంపతులు పాల్గొవచ్చని పేర్కొన్నారు. అయితే ఉదయం 6.10 గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పోస్టల్ 'ఇంటర్నేషనల్ ట్రక్డ్ ప్యాకెట్' సర్వీస్ ప్రారంభం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమం): తపాల శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్' సర్వీస్‌ను విజయవాడ డివిజన్‌లో శనివారం ప్రారంభించారు. అక్టోబర్ తొమ్మిదో తేదీన ప్రపంచ తపాల దినోత్సవాన్ని పురస్కరించుకొని తపాశాఖ ఈ సర్వీసును ప్రారంభించింది. అయతే విజయవాడ డివిజన్‌లో ఈ సర్వీస్ శనివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఆసియా, పసిఫిక్‌లో గల 12 దేశాలకు సంబంధించి ఈ సర్వీస్ కొనసాగుతుంది. మొదటి వంద గ్రాముల ఒక ధర ఆ తరువాత అదనంగా ఉండే ప్రతి వంద గ్రాములకు కొంత మొత్తాన్ని రుసుంగా నిర్ణయిస్తారని అధికారులు తెలిపారు. ఈ సర్వీస్ ద్వారా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, సౌత్‌కొరియా, హంకాంగ్, ఫిలిప్పీన్స్, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, థాయిలాండ్, కంబోడియా తదితర దేశాలకు పార్శిళ్లను పోస్టల్ శాఖ ద్వారా పంపవచ్చని అధికారులు తెలిపారు. ఈ సర్వీస్ మిగిలిన పార్శిల్ సర్వీసెస్ కంటే వేగవంతమైనదే కాకుండా చవకైనదని వివరించారు. దీనిని విజయవాడ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ సంతోషన్ నేతా ప్రారంభించారు. బల్క్ ఆర్డర్లకు ప్రత్యేక రాయితీ ఉంటుందని ఆయన ప్రకటించారు. ఈ సర్వీస్ నగరంలోని అన్ని పోస్టాఫీసుల నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. హెడ్ పోస్టాఫీస్‌లో జరిగిన ప్రారంభోత్సవంలో విజయవాడ సీనియర్ పోస్ట్‌మాస్టర్ కె.కనకరత్నారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో బియ్యం నిల్


బియ్యం లేకపోవటంతో యనమలకుదురులో మూసివేసిన రేషన్‌షాపు

యనమలకుదురు (పెనమలూరు): పెనమలూరు మండలంలోని పలు రేషన్ షాపుల్లో బియ్యం అందుబాటులో లేవు. తెల్లరేషన్‌కార్డు దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో మొత్తం 56 రేషన్ షాపులు ఉన్నాయి. తెల్లరేషన్ కార్డులు 36,437 ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 1వ తేదీ నుంచి తెల్లకార్డుపై కిలో రూపాయికి బియ్యం ఇవ్వాల్సి ఉంది. మండలానికి ప్రతి నెలా తెల్ల కార్డుదారులకు 4480 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వం కేటాయించి విడుదల చేయాలి. ఈ మేరకు రేషన్‌డీలర్లు గత నెలలోనే డీడీలు చెల్లించారు. ఈ నెల ప్రభుత్వం రేషన్ బియ్యం పూర్తిగా విడుదల చేయలేదు. మూడు వేల క్వింటాళ్ల బియ్యం మాత్రమే విడుదల చేశారు. డీలర్లు ఏమి చేయాలో తెలియక నోస్టాక్ బోర్డులు పెట్టారు. కార్డుదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రేషన్ బియ్యం ఇవ్వకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మురళీకృష్ణను వివరణ కోరగా బియ్యం సరఫరాలో జాప్యం జరిగిందని, త్వరలో రేషన్‌షాపులకు బియ్యం వస్తాయన్నారు.

కెమికల్ వస్తువులతో మూలవిరాట్‌కు విఘాతం

- భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని అభిషేకం మార్పు
- కమిషనర్ సూచినల మేరకే..
- ధార్మిక పరిషత్ అర్చక సంఘం సభ్యులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓ శారదాకుమారి

మోపిదేవి: మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంకు విచ్చేస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ యాజ్ఞిక బ్రహ్మ, హిందూ ధార్మిక పరిషత్ అర్చక సంఘం సభ్యులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ పేర్కొన్నారు. శనివారం ఆలయంకు విచ్చేసిన శ్రీ కోటిలింగ మహాశైవక్షేత్ర పీఠాధిపతి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆలయ ఏసీ ఎం శారదాకుమారి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూలమూర్తికి చేయలేని అర్చక పూజలు ఉత్సవమూర్తులకు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వయంభువు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి మూల విరాట్‌కు విఘా గం కలగకుండా విశేషమైన పూజలు అభిషేకాలకు మాత్రమే దేవస్థానం తరపున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివస్వామి వారు శనివారం సందర్శించి స్వామివారికి పూజా కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయని అం టూనే కొన్ని సూచనలు చేసినట్లు తెలిపారు. నాగమల్లి వృక్షం వద్ద గ తంలో నాగశిలలు ప్రతిష్ఠించే వారని, ప్రస్తుతం మహిళా భక్తులు సంతానం కొరకు ఆ వృక్షానికి ముడుపులు కట్టుకోవడంతో అక్కడ ప్రతిష్ఠించిన విగ్రహాలు చుట్టూ ప్రదక్షణలు చేయరాదని, పండితులు సూచించిన మీదట భక్తుల కోరిక మేరకు నాగశిలల ప్రతిష్ఠను సమీపంలోని పవిత్రస్థలం, గోశాల ప్రదేశం, యాగశాలలో కల్యాణ మండపం వద్ద నాగశిలలు ప్రతిష్టిస్తున్నట్లు వివరించారు.

శైవక్షేత్ర పీఠాధిపతి సందర్శన

మోపిదేవి: స్థానిక శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని గుంటూరు జిల్లా అమరావతి తాళ్ళాయపాలెం శ్రీశైవక్షేత్రం శ్రీ కోటిలింగ మహాశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, ఆలయ వేదపండితులు ఆయనకు హారతితో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలోని నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందించారు. ఆలయ ఏసీ ఎం శారదాకుమారి శివస్వామికి ఆహ్వానం పలికారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

ఉయ్యూరు: ధనుర్మాస పూజలు వైష్ణవాలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని శనివారం వెన్నతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నవనీత అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. మామిళ్లపల్లి సోమేశ్వరరావు, వేదాంతం మురళీకృష్ణ, బలరామకృష్ణలు ఈ అలంకరణ చేశారు. పూజలను ఆలయ ధర్మకర్త గబ్బిట దుర్గాప్రసాద్, వెంట్రప్రగడ వీరాంజనేయులు, గబ్బిట వెంకటరమణ పర్యవేక్షించారు. విష్ణాలయంలో ధనుర్మాస సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేకువ జామునే మేలుకొల్పు, సాయంత్రం వేళ ప్రవచనాలు చేసి భక్తుల్లో భక్తిపారవశ్యాన్ని నింపుతున్నారు.

ముగిసిన డిగ్రీ కళాశాలల ఆటలపోటీలు


కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న బాలికలు


వాలీబాల్ ఫైనల్స్‌లో పాల్గొన్న శారదా, వికాస్ కాలేజీల విద్యార్థులు

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజనీరింగ్ కళాశాల పదవ వార్షికోత్సవ సందర్భంగా 3 రోజుల పాటు జరిగిన అంతర్ డిగ్రీకళాశాలల ఆటలపోటీలు శనివారం ముగిశాయి. బాలుర కబడ్డీలో నూజివీడు శారదా కాలేజీ, తిరువూరు ప్రభుత్వ కళాశాల, క్రికెట్‌లో తిరువూరు ప్రతిభా కాలేజీ, మైలవరం ఎస్ఆర్ఎస్‌వీఆర్‌జీఎన్ఆర్ కాలేజీ, వాలీబాల్‌లో నూజివీడు శారదా కాలేజీ, నూజివీడు వికాస్ కాలేజీ, ఖోఖోలో తిరువూరు ప్రతిభా కాలేజీ, అక్షరా, బ్యాడ్మింటన్‌లో విస్సన్నపేట శ్రీశ్రీ, విజ్ఞాన్, బాలికల విభాగంలో కబడ్డీలో తిరువూరు అక్షర, ప్రతిభా, బ్యాడ్మింటన్‌లో తిరువూరు అక్షర, ప్రతిభా, ఖోఖోలో విస్సన్నపేట శ్రీశ్రీ, తిరువూరు అక్షరా కాలేజీల జట్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు ప్రకటించారు. విజేతలకు కళాశాల ఛైర్మన్ వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ విజయబిందు, ఎస్సీ కమీషన్ సభ్యురాలు సుధారాణి బహుమతులందజేశారు.

ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారు

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర రాజీనామా చేయాలి

మచిలీపట్నంటౌన్: విశాఖపట్నంలో జరిగిన జన్మభూమి సభ వద్ద వినతి పత్రం అందజేసిన మత్స్యకార సంఘ నాయకులను అవహేళన చేస్తూ మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని పలువురు మత్స్యకార సంఘ నాయకులు హెచ్చరించారు. శనివారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు మోకా భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎమ్మెల్యేగా ప్రాతినిద్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో మత్స్యకారుల ఓట్లు అధికంగా ఉన్నాయని, రానున్న ఎన్నికల్లో అక్కడి ప్రజలే నీ తాట తీస్తారని ఆయన ఎద్దేవా చేశారు. రానున్న 48 గంటల్లో ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఏపీ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో మత్స్యకారులకు ఉద్యోగాలు, గురుకుల పాఠశాలల్లో చదువు, ఎస్సీల్లో చేరుస్తానని హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్న చంద్రబాబు తీరా అధికారం చేపట్టి నాలుగేళ్లు గడుస్తున్నా ఈ హామీలను తుంగలోకి తొక్కటం విచారకరమన్నారు. ఈ సమావేశంలో చినకరగ్రహారం సర్పంచ్ నడకుదుటి వెంకటేశ్వరరావు, గిలకలదిండి ప్రాంత మత్స్యకారుల సంఘ నాయకుడు తిరుమలశెట్టి ప్రసాద్, గరాలదిబ్బ సర్పంచ్ ఒడుగు వెంకటనారాయణ, సంఘ నాయకుడు తమ్ము ఏడుకొండలు, పోలాటితిప్ప మత్స్యకార సొసైటీ మాజీ అధ్యక్షుడు సీహెచ్ నాగులు, గుండుపాలెం సొసైటీ అధ్యక్షుడు కె వేణుగోపాలరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ దేవేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార సంస్థ

- త్వరలో ప్రతి గ్రామంలో కేడీసీసీ ఏటీఎంలు
- సెంట్రల్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు


కేడీసీసీ ఏటీఎంను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరావు

కోడూరు : రైతు సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా సహకార బ్యాంకు సేవలందిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తున్నట్లు ఆ శాఖ సెంట్రల్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. రూ.10లక్షల వ్యయంతో నూతనంగా రూపుదిద్దుకున్న కోడూరు కేడీసీసీ బ్యాంకును రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఎంపీపీ మాచర్ల భీమయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే షరతుల గల పట్టాలకు రుణాల మంజూరు చేసేందుకు కేడీసీసీబీ సంస్థ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో శాఖ మైక్రో ఏటీఎంలు ఏర్పాటు చేసి రైతులకు మరింత చేరువైయ్యే విధంగా ప్రణాళిక రూపోందిస్తున్నట్లు వెంకటేశ్వరరావు చెప్పారు. జిల్లాలోని కొన్ని వాణిజ్య బ్యాంకులు హీనస్థితిలో ఉన్నాయని, వీటి కంటే కేడీసీసీ ద్వారా రైతులు లాభాలు ఎక్కువ పొందవచ్చన్నారు. కేడీసీసీబీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, సీఈవో సుబ్రహ్మణ్యం, మేనేజర్ ఎన్.సత్యన్నారాయణ, అవనిగడ్డ, కోడూరు జెడ్పీటీసీలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, సర్పంచి దాసరి విమల, లింగారెడ్డిపాలెం, బడేవారిపాలెం, ఉల్లిపాలెం, విశ్వనాథపల్లి పీఏపీఎస్ అధ్యక్షులు కడవకొల్లు శ్రీనివాసరావు, బడే వెంకటరమణ, కొక్కిలిగడ్డ శ్రీమన్నారాయణ, తోట రాంబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, సంఘ సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగరాజస్వామికి స్వరార్చన


త్యాగరాజ కృతులను గానం చేస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి, భాషా సాంస్కృతిక శాఖ ఆధర్వంలో సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సంగీత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో త్యాగరాజస్వామి, ఆంజనేయ స్వామి వారి విగ్రహాల ఊరేగింపు ప్రత్యేక ఆర్షణగా నిలిచింది. ఉదయం 8 గంటలకు సంగీత కళాశాలో ప్రారంభమై సత్యనారాయణపురం, గిరివీధి, బీఆర్‌టీఎస్ రోడ్డుగా సాగి సంగీత కళాశాలకు చేరుకుంది. దారిపొడుగునా సంగీత విద్వాంసులు, కళాకారులు త్యాగరాజ స్వామికి నీరాజనాలు అందించారు. పలు త్యాగరాజకృతులను గానం చేశారు. సంగీత కార్యక్రమంలో బాలశ్రీవాణి, సోమదత్త, పద్మశ్రీ,అంజనా సుధాకర్ బృందం, కల్యాణి బృందం సంగీత కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజన్ తదితరులు త్యాగరాజ స్వామి కృతులను గానం చేశారు. కార్యక్రమంలో సంగీత సన్మండలి అధ్యక్షుడు పెమ్మరాజు సూర్యారావు, సంస్థ సభ్యులు అంజనా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచరత్నకీర్తనల గోష్ఠిగానం

ఆదివారం ఉదయం 9 గంటలకు త్యాగరాజస్వామి రచించిన పంచరత్నకీర్తనల గోష్ఠిగానం ఉంటుందని సంగీత సన్మండలి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు.

సంకల్పసిద్ధిరస్తు


కల్లూరు శివారులో జగన్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఇబ్బందుల పాలు కావొద్దు


పాడిరైతు కష్టం తెలుసుకుంటూ..

మామయ్య దీవెన


శ్రీనివాసపురంలో చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకుని ముద్దాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

కదిలిన జగన్ దండు


సంకల్పయాత్రలో మేము సైతం అంటూ..

నీ సంకల్పానికి రైట్..రైట్


కల్లూరు శివారులో జగన్‌తో ఆర్టీసీ డ్రైవర్ కరచాలనం

Praja Sankalpa Yaatra

• నీ రాక కోసం


ఎదురు చూపు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం

• కేరింత


యువజోరు : కల్లూరులో జగనన్నకు హాయ్

• అదిగో రాజన్న బిడ్డ


ఆనందకేళి : మిద్దెపై నుంచి జననేతను చూస్తూ..

• మళ్లీ రా అన్నా..


తీరిన ముచ్చట : తమ అభిమాన నేతకు అభివాదం చేస్తూ..

• ఆత్మీయ అభివాదం


టాటా : జననేతకు వీడ్కోలు పలుకుతూ..


చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని కల్లూరులో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన ముస్లింలు

ముస్లింలనుద్దేశించి ప్రసంగిస్తున్న జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సంకల్పానికి సలాం

శక్తినంతా కూడగట్టుకుని.. లేని సత్తువ తెచ్చుకుని.. వృద్ధాప్యాన్ని పక్కనబెట్టి.. అవ్వాతాతలు కదిలి వస్తున్నారు.. మనవడ్ని చూడాలని.. దీవెనలందించాలని.. జీవిత చరమాంకంలో పింఛను ఆసరా ఇచ్చిన రాజన్న బిడ్డకు సంఘీభావం తెలపాలని..

బాబు వస్తేనే జాబు అన్న మాటలు నమ్మి మోసపోయిన నిరుద్యోగ యువతలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. కొత్తవి దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలనూ ఊడబెరుకుతున్న టీడీపీ సర్కారు తీరుపై నమ్మకం పూర్తిగా సడలిపోయింది.
ఈ రాష్ట్ర సారథ్యానికి జననేత రావాలని వారంతా సంకల్పిస్తున్నారు..
అందుకే జగన్ సంకల్పయాత్రకు జై కొడుతున్నారు.

బిడ్డల్ని చదివించడానికి అష్టకష్టాలు పడుతున్న తల్లిదండ్రుల్లో 'నవరత్నాలు' కొత్త ఆశల వెలుగుల్ని నింపాయి. ఈ హామీనిచ్చిన జగనన్న స్వయంగా తమ పల్లెకు నడచి వస్తున్నాడని తెలిసి పనులన్నీ పూర్తిచేసుకుని అడుగులో అడుగేస్తున్నారు. ప్రజాసంకల్పం నెరవేరాలని జననేతను అనుసరిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రకు రోజురోజుకూ జనస్పందన విశేషంగా పెరుగుతోంది. పల్లెలన్నీ పాదయాత్రలో మేము సైతమంటూ పాలుపంచుకుంటూ విపక్ష నేతకు మద్దతు పలుకుతున్నాయి. జగన్ పాదయాత్ర శనివారం పుంగనూరు నియోజకవర్గంలో దిగ్విజయంగా కొనసాగింది.


ప్రగతి రథానికి బాసట : ఆడపడుచుల తోడుగా..


పెల్లుబికిన ఆగ్రహం : పరీక్షలు నిర్వహించలేదని జననేతతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డీఎడ్ విద్యార్థినులు


విరిసిన ఆనందం : తమ అభిమాన నేత కోసం పూలు చల్లి ఎదురు చూస్తున్న అక్కాచెల్లెమ్మలు


జన తోరణం..


మా దేవుడు నువ్వు..

• జీవిత చక్రం


కుమ్మరి చక్రాన్ని ఆసక్తిగా పరిశీలిస్తూ..

• చెరగని జ్ఞాపకం


సంతోష సెల్ఫీ : అన్నతో ఆప్యాయంగా సెల్ఫీ దిగుతున్న చెల్లెమ్మ



• ఏమైంది తల్లీ


చల్లావారిపల్లె వద్ద అంధురాలితో మాట్లాడుతున్న జగనన్న

• ఆత్రుత


శ్రీనివాసపురంలో ట్రాక్టర్ పైకెక్కి ఎదురు చూస్తున్న అభిమానులు

• నేనున్నానని


చల్లావారిపల్లె వద్ద అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ..

• మీకు అండగా ఉంటా..


భరోసా : అన్నతో కష్టాలు పంచుకుంటున్న అక్కాచెల్లెమ్మలు

• అధైర్యమొద్దు


ఏడ్వకమ్మా : కష్టాలు తెలియజేస్తూ..

కడదాక జగనన్న వెంటే..



ఇచ్ఛాపురం వరకు జగనన్నతోనే.. ప్రజా సంకల్పయాత్రలో మేము సైతం అంటూ పలువురు భాగస్వాములవుతున్నారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు ఉండడం పలువుర్ని ఆలోచింపజేస్తోంది. అనంతపురానికి చెందిన సాకే ఆంజనేయులు (31), జి రోజా (26) దివ్యాంగులు. వీరు అనంతపురం నుంచి మూడు చక్రాల బండిలో పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలోని గాండ్లపల్లెకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఇచ్ఛాపురం వరకు తమ అభిమాన నేతతో కలిసి పాదయాత్ర సాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

– బి.కొత్తకోట

క్రీడాకారులకు అండగా ఉండాలి



'అన్నా.. చదువుకుని ఆటల్లో బాగా రాణిస్తా ఉండే క్రీడాకారులకు అండగా నిలబడి మీరు భరోసా ఇవ్వాలి. మీ మాట కోసం క్రీడాకారులు ఆశగా ఎదురు చూస్తా ఉండారు..' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ఇమామ్ కోరారు. పుంగనూరు నియోజకవర్గంలోని చల్లావారిపల్లె సమీపంలో జననేతను కలిసి క్రీడాకారుల కష్టాలు తెలియజేశారు. వారికి అండగా ఉండాలని కోరారు.

– చిత్తూరు అర్బన్

నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి సామి



'సెట్టంత కొడుకయ్యా.. ఇప్పటికే రెండు సార్లు ఆపరేషన్లు చేయించినాం. అయినా వాడి పరిస్థితి మార్లేదు. మీరే ఆదుకోవాలి. నాబిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలి సామీ..' అంటూ పుంగనూరు నియోజకవర్గంలోని చల్లావారిపల్లె పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన ఎం.రత్నమ్మ కోరారు. ప్రజాసంకల్పయాత్రలో జననేతను కలిసిన ఆమె తన కుమారుడు ఆంజనేయుల్ని చూపించారు. 21 ఏళ్ల వయస్సున్న కొడుకుకు తలలో ఓ గడ్డ ఉందని.. రెండు సార్లు ఆపరేషన్లు చేయించినా ఫలితం లేకుండా పోతోందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించడానికి తమ వద్ద అంత డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంజనేయులకు మెరుగైన వైద్య సేవలందించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సిబ్బందిని ఆదేశించారు.

టూరిజం..ప్రయివేటిజం



'రాష్ట్ర టూరిజం శాఖను ప్రైవేటుపరం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్ర పన్నుతున్నారని' ఆ శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఆరోపించారు. 2014 ఎన్నికలకు వెళ్లకముందు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పిన తెలుగుదేశం పార్టీ.. నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లాలో పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందచేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.